

ప్రసంగిస్తున్న టీజీ వెంకటేశ్, వేదికపై అంబికా కృష్ణ, నూతన కార్యవర్గ సభ్యులు

ఆర్యవైశ్యులకు అన్యాయం జరిగితే ఖబడ్దార్

- వచ్చే ఎన్నికల్లో ఐదు నుంచి పది టికెట్లు ఇవ్వాలి
- ఆర్యవైశ్య మహాసభలో మాజీ మంత్రి టీజీ వెంకటేశ్

గుంటూరు, జనవరి 26: 'ఆర్యవైశ్యులకు అన్యాయం జరిగితే ఖబడ్దార్! నేనున్నా.. ఎవరికి ఏ ఇబ్బందులు వచ్చినా అందరూ అండగా ఉండాలి' అని మాజీ మంత్రి టీజీ వెంకటేశ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్యమహాసభ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శుక్రవారం గుంటూరులో జరిగింది. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీలైనా ఐదు నుంచి 10 స్థానాలు ఆర్యవైశ్యులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. 'వైసీపీ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసింది.. వెయ్యి కోట్ల సంగతి సరే.. కనీసం ఇప్పటికైనా మించిపోయింది లేదు రూ.100 కోట్లు డిపాజిట్ చేయాల'ని కోరారు. గుంటూరు పశ్చిమ నుంచి ఎమ్మెల్యే మద్దాళి గిరికి వైసీపీ టికెట్ నిరాకరించం తనకు బాధని పించిందన్నారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగడానికి ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. సంఘం పూర్వాధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, క్రేన్ గ్రూప్ సంస్థల అధినేత జీవీఎస్ఎల్ కాంతారావు, మద్దాలి గిరి, పోతుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం

సభలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహాసభ గౌరవ చైర్మన్‌గా మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, మహాసభ అధ్యక్షుడిగా చిన్ని రామసత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిరివీధి ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా శేగు షణ్ముఖరావు ప్రమాణం చేశారు. కోశాధికారిగా నుదురుమాటి శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజర్‌గా కోట గురుబ్రహ్మం, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా దూపకుంట్ల శబరివరప్రసాద్, పొలిటికల్ చైర్మన్‌గా కోట సత్యం, అడ్వైజర్‌గా పోతుల సురేష్ ప్రమాణస్వీకారం చేశారు.

వైసీపీ అభ్యర్థులకు దొంగ డబ్బే ఆధారం

- చిత్తూరులో స్మగ్లర్ తీసుకెళ్లిన ఆ 50 కోట్లు ఎవరివి?
- పోలీసులు తేల్చాలని అమరనాథ్‌రెడ్డి డిమాండ్

చిత్తూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అభ్యర్థులకు ఎర్రచందనం, ఇసుక, మద్యం అక్రమ రవాణా ద్వారా లభించే దొంగ డబ్బే ఆధారమని మాజీ మంత్రి, టీడీపీ నేత అమరనాథ్‌రెడ్డి ఆరోపించారు. 'కోట్ల సొమ్ముతో పరార్' అంటూ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఆయన చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డికి చెందిన అయ్యప్ప వెంచర్‌లో బుధవారం ఎర్రచందనం స్మగ్లర్లు సమావేశమై రూ.కోట్ల సొమ్ము పంచుకోవడంలో గొడవ పడ్డారని అన్నారు. అక్కడి నుంచి ఓ స్మగ్లర్ రూ.50 కోట్లతో పరారవ్వగా, జిల్లాకు చెందిన అధికార పార్టీ నేత రంగంలోకి దిగారని.. స్మగ్లర్‌ను, రూ.50 కోట్లను పట్టుకునే బాధ్యతను పోలీసులకు అప్పగించారని ఆయన ఆరోపించారు. జిల్లా పోలీసులు ఈ వ్యవహారాన్ని మూడో కంటికి తెలియకుండా డీల్ చేస్తున్నారన్నారు. ఆ రూ.50 కోట్ల సొమ్ము ఎవరిదో వెంటనే తేల్చాలని అమర్ డిమాండ్ చేశారు.

ఏపీ నాన్ గజిటెడ్ సంఘంలోకి గజిటెడ్ ఆఫీసర్స్

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పేరును ఇక నుంచి ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గజిటెడ్ అధికారుల సంఘంగా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఏపీ నాన్ గజిటెడ్ అధికారుల సంఘంగా ఉండేది. ఆ సంఘం స్టేట్ కౌన్సిల్ సమావేశం నిర్వహించుకుని పేరు మార్పుపై తీర్మానించింది. సంఘం బైలాను కూడా మార్చారు. ఈ మార్పులను స్టేట్ కౌన్సిల్ ఆమోదించి ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వం పరిశీలించి మార్పులకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ గజిటెడ్ ఉద్యోగులు సంఘంలో సభ్యులుగా చేరడానికి వీలుగా నిబంధనలకు సవరణ చేశారు.

దేవుడినైనా వేలం!

(మొదటి పేజీ తరువాయి)

టీచర్ల డిప్యుటేషన్లు మొదలుకొని కరోనా సమయంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో బెడ్లు అమ్ముకోవడం వరకు... అన్ని పనుల్లోనూ కాసుల వేటే. ఆయన, ఆయన అనుచరగణం... వీరి అక్రమాలు ఘనం! చివరకు దేవుడి ఆస్తులనే కబ్జా చేసేందుకు తెగించారు. ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ ఉత్సవ రథంపై ఉన్న మూడు వెండి సింహాలు 2020 సెప్టెంబరులో చోరీకి గురయ్యాయి. ఈ సమయంలో మంత్రి చేసిన వ్యాఖ్యలు విచారణను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయన్న విమర్శలు అప్పట్లో వచ్చాయి. వెండి సింహాలు గత ప్రభుత్వ హయాంలోనే చోరీకి గురి అయిఉండొచ్చునని ఆయన వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఈ చోరీ వెనుక మంత్రి అనుచరుల హస్తమే ఉందన్న ప్రచారం జరిగింది. చివరికి అనామకులను ఈ కేసులో నిందితులుగా చూపి కేసు మూసివేశారు.

అమ్మో ఎమ్మెల్యే

అది మంత్రికే చెల్లింది..

పలు ఆలయాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కొత్త సంస్కృతికి ఆయనే నాంది పలికారు. మంత్రి పక్కనే ఉన్న శ్రీసత్యభామ రుక్మిణీ సమేత శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానాన్ని ఒక కులసంఘానికి కట్టబెడుతూ జీవో విడుదలైంది. ఆ ఆలయాన్ని తమ పూర్వీకులు నిర్మించారని, అది తమకు చెందుతుందని ఆ కులస్థులు పెట్టుకున్న దరఖాస్తు మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆలయానికి ఉన్న సుమారు రూ.కోట్లు విలువైన ఆస్తులను కొట్టేసే ప్లాన్‌లో భాగంగానే ఈ జీవో విడుదలైంది. ప్రతిఫలంగా భారీగానే ఆ నేతకు లబ్ధి చేకూరిందని ప్రచారం జరిగింది. వేణుగోపాలస్వామి ఆలయానికి నెలకు సుమారు లక్ష రూపాయలు సమకూరే ఆస్తులు ఉన్నాయి. గుడి చెంతనే 21 కమర్షియల్ దుకాణాలు ఉన్నాయి. మైలవరం నియోజకవర్గం కౌలూరులో 2 ఎకరాల పొలం ఉంది. ఇలాంటి ఆలయాన్ని కుల సంఘం పెద్దలు అడిగారని ప్రభుత్వం ఆగమేఘాలపై కట్టబెట్టేయడం అప్పట్లో అనుమానాలు రేపింది.

సొంత ఆలయానికి రూ.1.30 కోట్ల సీజీఎఫ్ నిధులు

మంత్రి కుటుంబం చేతిలో ఓ ఆలయం ఉంది. జీర్ణావస్థలో ఉన్న ఆలయాల మరమ్మతుల కోసం సర్వశ్రేయోనిధి(కామన్ గుడ్ ఫండ్- సీజీఎఫ్) నిధులను దేవదాయశాఖ వినియోగిస్తుంది. అయితే, తన పరపతిని వాడి ఈ నిధులను తన కుటుంబం ఆలయానికి ఆయన మళ్లించారు. ఏకంగా పురావస్తు శాఖ ఆధీనంలోని స్థలాన్ని ఆక్రమించేశారు. దేవాదాయశాఖలో రిజిస్టర్డ్ ఆలయంగా ఉన్న ఈ ఆలయానికి ఈవో ఉండరు. ప్రైవేటు ట్రస్టీల ఆధ్వర్యంలో నిర్వహణ జరుగుతోంది. ఆ నేత తండ్రి ఆలయం ట్రస్టు చైర్మన్. గత కొన్నేళ్లుగా ఆయనే చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ ఆలయం చుట్టుపక్కల ప్రాంతమంతా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి పరిధిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆయన మంత్రి అయిన తర్వాత ఈ ఆలయం చుట్టుపక్కల ఉన్న పురావస్తు శాఖ స్థలంపై కన్ను పడింది. ఆ శాఖ స్థలాన్ని ఆలయం పేరుతో తమ ఆధీనంలోకి తెచ్చుకుని అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఈ షాపుల నిర్మాణానికి సీజీఎఫ్ నిధులను రూ.1.30 కోట్లు కేటాయింప చేసుకున్నారు. సాధారణంగా సీజీఎఫ్ నుంచి గరిష్ఠంగా రూ.40 లక్షల వరకు కేటాయిస్తుంటారు. కానీ మంత్రి సొంత ఆలయం కావడంతో చేయి కాస్త పెద్దదైంది. ఈ నిధులతో 10 దుకాణాలతో భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టారు.

కరోనానూ క్యాష్ చేసుకున్నారు..

కరోనా కాలంలోనూ ఆ నేత కక్కుర్తి బుద్ధిని బయటపెట్టుకున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, మందుల దుకాణాల వారిని మంత్రి అనుచరుడు సమావేశపరిచిన తాము సరఫరా చేసే పీసీడీ మందులనే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేశారు. మాట వినకుంటే ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ పీసీడీ మందుల దందా ద్వారా కరోనా కాలంలో సుమారు రూ.50 కోట్ల మేర మంత్రి, ఆయన అనుచరులు ఆర్జించారు. 2020- 21లో కరోనా మహమ్మారి ప్రజలను బెంబేలెత్తిస్తున్న సమయంలో మంత్రి అండ చూసుకుని ఆయన అనుచరగణం భారీ ఎత్తున సొమ్ములు వెనకేసుకుంది. మంత్రి సన్నిహితుడిగా పేరొందిన ఒక మెడికల్ డిస్ట్రిబ్యూటర్ పీసీడీ మందుల దందాతో సుమారు రూ.50 కోట్లు పైచిలుకు ఆర్జించారు. ఫార్మా కంపెనీ తయారు చేసిన బ్రాండెడ్ మందుకు పేటెంట్ హక్కుల గడువు ముగిసిన తర్వాత ఆ మందు ఫార్ములాతో ఇతర కంపెనీలు ఏవైనా ఆ మందును తయారు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇలా తయారు అయ్యేవే జనరిక్ మందులు. కొన్నిసార్లు పెద్ద కంపెనీలు కూడా మార్కెట్ పోటీని తట్టుకునేందుకు తాము గతంలో బ్రాండెడ్‌గా అమ్మిన మందులనే పేటెంట్ గడువు ముగిసిన తర్వాత బ్రాండెడ్‌తోపాటు జనరిక్ మందులుగా కూడా తీసుకొస్తుంటాయి. ఈ రెండు కాకుండా పీసీడీ మందులు అనేవి ఉంటాయి. ఫలాన మందు మాకు తయారు చేసి ఇవ్వండి, దానికి పేరు పెట్టుకుని, అమ్ముకుంటామని ఓ ఫార్మా కంపెనీతో ఒప్పందం చేసుకోవడం ద్వారా ఈ పీసీడీ మందుల తయారీ మొదలవుతుంది. ఉదాహరణకు ఓ ఫార్మా కంపెనీ డోలో పేరుతో ఓ మందు బిళ్లను తయారు చేసిందనుకుంటే అదే ఫార్ములాతో ఎలాంటి పేరు లేకుండా కేవలం ట్యాబ్లెట్లను తయారు చేసి ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం అన్నమాట. వీటిలో భారీ ఎత్తున మార్జిన్ ఉంటుంది. నాణ్యంగా తయారు చేయించుకునే వ్యక్తి.. తయారు చేసే వారిపైన ఆధారపడి ఉంటుంది. కరోనా కాలంలో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులు, మందుల దుకాణాల వారిని సమావేశపరిచిన మంత్రి అనుచరుడు తాము సరఫరా చేసే పీసీడీ మందులనే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేశారు. మాట వినకుంటే ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ పీసీడీ మందుల దందా ద్వారా కరోనా కాలంలో సుమారు రూ.50 కోట్ల మేర మంత్రి, ఆయన అనుచరులు ఆర్జించారు.

మామ పేరుతో రూ.8 కోట్ల స్థలాన్ని కొట్టేశారు...

మంత్రిగా ఉన్న సమయంలో ఈ నేతకు ఓఎస్డీగా ఓ వ్యక్తి పనిచేశారు. ఆయన మామ పేరుతో సుమారు రూ.8 కోట్ల విలువైన స్థలాన్ని అప్పట్లో ఆయన కొట్టేశారు. మంత్రి నియోజకవర్గం పరిధిలోని ఓ ఆశ్రమంలో 5.16 ఎకరాల భూమి దేవదాయశాఖ పేరుతో ఉంది. సుమారు రూ.15 కోట్లు విలువైన ఈ భూమి తమ పూర్వీకులదని, ఎన్‌వోసీ ఇవ్వాలంటూ అప్పలస్వామి సత్రం, ట్రస్టు నిర్వాహకులు దేవదాయశాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ భూమికి ఎన్‌వోసీ ఇప్పిస్తానని వారికి చెప్పి ఓఎస్డీ చక్రం తిప్పారు. ప్రతిఫలంగా తనకు ట్రస్టు నిర్వాహకులకు ఉన్న రూ. 8 కోట్ల విలువైన స్థలాన్ని ఇవ్వాలని ఒప్పందం చేసుకు మామ పేరుతో జీపీఏ చేయించేశారు. ఈ మొత్తం కథ ఆ నేత కనుసన్నల్లోనే నడిచింది. ఓఎస్డీ మామ...మంత్రి బినామీ అన్న ఆరోపణలు ఉన్నాయి.



శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్తున్న జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

మల్లన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

శ్రీశైలం, జనవరి 26: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. న్యాయమూర్తికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ వెంకట జ్యోతిర్మయి స్వామివారికి అభిషేకం నిర్వహించారు.



ఖాద్రీశుడి ఆలయంలో జస్టిస్ మన్మథరావును సత్కరిస్తున్న అర్చకులు

ఖాద్రీశుడిని దర్శించుకున్న జస్టిస్ మన్మథరావు

కదిరిలీగల్/పుట్టపర్తి, జనవరి 26: శ్రీసత్యసాయి జిల్లా కదిరి శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు శుక్రవారం దర్శించుకున్నారు. అలాగే పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించారు.



లోయలో పడిన వాహనం

రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

- పల్నాడు జిల్లాలో బస్సు కిందకు దూసుకెళ్లిన ఆటో
- ముగ్గురు వ్యవసాయ కూలీలు మృత్యువాత
- 13 మందికి తీవ్రగాయాలు
- విశాఖ జిల్లాలో లోయలోకి వాహనం
- ఒకరి దుర్మరణం, ముగ్గురికి గాయాలు

చిలకలూరిపేట/అరకులోయ, జనవరి 26: రాష్ట్రంలో రహదారులు రక్తమోడాయి. రెండు జిల్లాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. పల్నాడు జిల్లా నరసరావుపేట-చిలకలూరిపేట రహదారిపై లింగంగుంట్ల గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యవసాయ కూలీలు మృతి చెందారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామం నుంచి వీరంతా వ్యవసాయ పనుల నిమిత్తం ఆటోలో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అదుపు తప్పిన ఆటోను తప్పించేందుకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రయత్నించగా సాధ్యపడలేదు. ఈ క్రమంలో బస్సు కిందకు వెళ్లడంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వికసిరి హనుమాయమ్మ(60) అక్కడికక్కడే మృతి చెందగా, షేక్ హజరత్ వలి(70), గన్నవరపు శివ పార్వతి (65) ఆస్పత్రులకు తరలిస్తుండగా మృతి చెందారు. 13 మంది తీవ్రంగా గాయపడగా వారిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారిలో పది మందిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా.. విశాఖలోని ఓ షాపింగ్‌మాల్ గోదాములో పనిచేస్తున్న ఎనిమిది మంది సిబ్బంది, మరో ఇద్దరు పిల్లలు కలిసి శుక్రవారం అనంతగిరి, అరకులోయ మండలాల్లో పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ఇన్నోవా వాహనంలో బయలుదేరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా సుంకరమెట్ట దాటిన తర్వాత పిడిబంద గ్రామానికి సమీపంలో మలుపు వద్ద వాహనం బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో వాహనం అదుపుతప్పి సుమారు 25 అడుగుల లోయలోకి కారు దూసుకుపోయి పెద్ద బండరాయిని ఢీకొని ఆగిపోయింది. ఈ క్రమంలో కారు మధ్య డోర్ తెరుచుకోవడంతో పైలా అన్నపూర్ణాదేవి (34) బయటకు పడిపోగా తలకు తీవ్రగాయాలయ్యాయి. ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో అరకులోయ ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. అన్నపూర్ణాదేవి అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ కుమార్ బాబు తెలిపారు.

శంకుస్థాపనలే... పనుల్లేవ్!



బియ్యపు తిప్ప వద్ద హార్బర్ ప్రతిపాదిత ప్రాంతం

పశ్చిమలో రూ.3,200కోట్లతో ప్రాజెక్టులంటూ హడావుడి

- 2022 నవంబరులో శంకుస్థాపన చేసిన సీఎం జగన్
- 14 నెలలు అవుతున్నా అడుగు కూడా కదలని పనులు
- బియ్యపు తిప్ప వద్ద అతీగతీ లేని హార్బర్ నిర్మాణం
- నల్లీ క్రాక్ కాలువలో పూడికతీత పనుల ఊసే లేదు
- రెగ్యులేటర్ల నిర్మాణానికి అనుమతులివ్వని సర్కారు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమగోదావరి జిల్లాలో ప్రాజెక్టులు పడకేశాయి. సాక్షాత్తూ సీఎం జగన్ శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు ఒక్క అడుగు ముందుకు పడటంలేదు. 2022 నవంబరులో మత్స్యకార దినోత్సవం రోజున నరసాపురం వచ్చిన ముఖ్యమంత్రి దాదాపు రూ.3,200కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పటి వరకూ అందులో ఒక్క పనీ ప్రారంభించలేదు. సదరు ప్రాజెక్టులకు టెండర్లు పిలవడం మాట అటుంచి.. అసలు ప్రభుత్వమే వాటికి ఇప్పటికీ అనుమతులు మంజూరు చేయలేదు. నరసాపురం మండలం బియ్యపు తిప్ప వద్ద రూ.429.00 కోట్లతో హార్బర్ నిర్మాణం చేపడుతున్నట్టు నాటి సభలో సీఎం ప్రకటించారు. సభా వేదిక పైనుంచే పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. ఏజన్సీని ఖరారు చేశామని, హార్బర్ పూర్తయితే తీరప్రాంత రూపురేఖలు మారిపోతాయని, మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు చూస్తామంటూ గొప్పగా చెప్పారు. ఇది జరిగి దాదాపు 14నెలలు పూర్తయ్యాయి. ఇప్పటికీ బియ్యపు తిప్ప వద్ద ఒక్క పునాది రాయి కూడా పడలేదు. పనులు జరుగుతాయన్న ఆశాలేదు. మరోవైపు తీరప్రాంతంలో నల్లీ క్రీక్ కాలువ పూడుకుపోయింది. సముద్రం నుంచి నీరు ఎగదన్నే అదే కాలువలో మత్స్యకారులు చేపల వేట సాగించి జీవనోపాధి పొందేవారు. సదరు నల్లీ క్రీక్ పనులను టీడీపీ హయాంలో ప్రారంభించారు. 25శాతం పనులు పూర్తి కాలేదంటూ వైసీపీ ప్రభుత్వం వాటిని నిలిపివేసింది. ప్రస్తుతం నల్లీ క్రీక్ ఊసే లేదు.

రెగ్యులేటర్లంటూ జనం చెవిలో పూలు

కొల్లేరు మంచినీటి సరస్సు జలాలు సముద్రంలో కలిసే ఉప్పుటేరుపై మూడు రెగ్యులేటర్ల నిర్మాణానికి నీటి పారుదల శాఖ ప్రతిపాదనలు చేసింది. తొలుత రూ.360కోట్లతో రెగ్యులేటర్లు నిర్మించేందుకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు స్పందించలేదు. అ తర్వాత అంచనాలను సవరించారు. కొత్త ధరలో 3 రెగ్యులేటర్ల విలువ రూ.420 కోట్లకు పెరిగింది. వీటిలో ఒకటైన పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండల పరిధిలోని మోళ్లపర్రు వద్ద రెగ్యులేటర్‌కు జగన్ శంకుస్థాపన చేశారు. రెగ్యులేటర్ ఆవశ్యకతను నరసాపురం సభలోనే ఆయన వివరించారు. రెగ్యులేటర్లు నిర్మిస్తే సముద్రపు నీరు కొల్లేటి సరస్సులోకి రాకుండా ఉంటుంది. పశ్చిమ డెల్టా ప్రాంతంలో లవణీయత తగ్గుముఖం పడుతుంది. రెగ్యులేటర్ల నిర్మాణం ఖాయంగా జరిగిపోతుందంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఆశలు రేకెత్తించారు. అయితే వాటి నిర్మాణం కోసం నీటి పారుదల శాఖ పంపిన సవరణ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఇప్పటికీ పరిపాలన అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు వచ్చిన తర్వాతే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాల్సి ఉంది. కానీ సీఎం మాత్రం ముందుగానే శంకుస్థాపన చేసేశారు. ఇక ఉభయగోదావరి జిల్లాలను నరసాపురం మీదుగా కలిపే వశిష్ట వారధి నిర్మాణానికి జగన్ హామీ ఇచ్చారు. రూ.490 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. అయితే ఇప్పటికీ టెండర్లు తెరవకుండా వాయిదా వేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడే లోపు టెండర్లు ఖరారు కాకపోతే ఇక ఇప్పట్లో పనులు ప్రారంభించే అవకాశమే ఉండదు.

సర్వేతో సరిపెట్టుకున్న వాటర్ గ్రిడ్

పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలకు విజ్జేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి జలాలను శుద్ధి చేసి పైప్‌లైన్ ద్వారా అందించేందుకు రూ.1,400 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకాన్ని అమలు చేస్తున్నారు. టీడీపీ హయాంలో రూ.3,600 కోట్లతో పూర్వ పశ్చిమగోదావరి జిల్లాకు గోదావరి జలాలను నేరుగా అందించే ప్రాజెక్టును సిద్ధం చేశారు. వీసీపీ ప్రభుత్వంలో దాన్ని రూ.1,400 కోట్లకు కుదించారు. కొత్త పశ్చిమ గోదావరి జిల్లాకు ప్రాజెక్టును పరిమితం చేశారు. దీనినుంచి పట్టణాలను మినహాయించారు. వాటర్ గ్రిడ్ పనులు కూడా ప్రారంభిస్తున్నట్టు నరసాపురం సభ నుంచే ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పటికీ సర్వే పనులే పూర్తి కాలేదు. ప్రభుత్వానికి నివేదిక అందలేదు.

ఈ పనులకు మోక్షమెప్పుడు?

- మొగల్తూరు మండలం రుస్తుంబాదలో రూ.133 కోట్లతో 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు.
- నరసాపురం పట్టణంలో రూ.149.00 కోట్లతో వాటర్ ప్రాజెక్ట్, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మిస్తామంటూ హడావుడిగా జీవో విడుదల చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం నిదులు మంజూరు చేయలేదు. టెండర్లు పిలవలేదు. వీటికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం విశేషం.
- నరసాపురంలో ఆక్వా విశ్వవిద్యాలయాన్ని రూ.332 కోట్లతో చేపట్టాల్సి ఉంది. సుమారు రూ.100 కోట్లతో తరగతి గదుల భవనాలు ప్రారంభించారు. పునాదులు వేశారు. నిదులు లేకపోవడంతో ఇప్పుడు ఈ పనులకు అతీగతీ లేకుండా పోయింది.
- కోతకు గురైన ఏటిగట్టును రూ.35కోట్లతో పూర్తి చేసేందుకు సీఎం శంకుస్థాపన చేసిన పనులు ప్రారంభించారు. ఇప్పటికి రూ.15కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అదే ఏటి గట్టు ఇటీవల మళ్లీ కోతకు గురైంది. పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడమే కారణమని విమర్శలున్నాయి.



శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు గ్రామ సచివాలయం-1 వద్ద జాతీయ పతాకం బదులు రెపరెపలాడుతున్న వైసీపీ జెండా

త్రివర్ణం లేదు.. వైసీపీ జెండాయే!

కొత్తచెరువు, జనవరి 26: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద జాతీయ పతాకం రెపరెపలాడితే.. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1 వద్ద మాత్రం వైసీపీ జెండా రెపరెపలాడింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగురవేయాల్సిన సచివాలయ సిబ్బంది, ఇక్కడ కనీసం వేడుకలను కూడా నిర్వహించలేదు. పది రోజుల క్రితం సచివాలయ ఆవరణలో ఎగురవేసిన వైసీపీ జెండాను అలాగే ఉంచారు. ఇదేమిటని అడిగితే.. ఫీల్డ్‌పై బయటకు వెళ్లడంతో గణతంత్ర వేడుకలు నిర్వహించలేదని సచివాలయ సిబ్బంది సాకులు చెప్పుకొచ్చారు. వైసీపీ జెండా ఎగరడం చూసి.. జాతీయ పతానికి ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ స్థానికులు మండిపడ్డారు.

ఈల వేసి వెకిలి చేష్టలు

- నిలదీయగా జుట్టుపట్టి పిడిగుద్దులు
- మహిళపై వైసీపీ నాయకుడి దాష్టీకం
- గణతంత్ర దినోత్సవాన వీడియో వైరల్



మహిళపై దాడి చేస్తున్న వైసీపీ నాయకుడు నటరాజ్ ..., ఆస్పత్రిలో రోదిస్తూ గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత మహిళ లక్ష్మి

కళ్యాణదుర్గం, జనవరి 26: గణతంత్ర దినోత్సవం రోజునే ఓ మహిళపై వైసీపీ నేత దాష్టీకానికి పాల్పడ్డాడు. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామానికి చెందిన లక్ష్మిని శుక్రవారం వైసీపీ నాయకుడు, గ్రామ సచివాలయ కన్వీనర్ నటరాజ్ జుత్తుపట్టి లాగి విచక్షణారహితంగా చితకబాదాడు. బాధితురాలి కథనం మేరకు.. నాగరాజు భార్య లక్ష్మి పాలవెంకటాపురంలో టైలరింగ్ షాపు నిర్వహిస్తోంది. శుక్రవారం షాపు నుంచి ఇంటికి బయల్దేరింది. దారిమధ్యలో కాపుకాచిన వైసీపీ నాయకుడు నటరాజ్ ఆమెను చూసి ఈలలు వేస్తూ వెకిలి చేష్టలు చేశాడు. దీంతో ఆమె నిలదీసింది. దీంతో రెచ్చిపోయిన నటరాజ్.. ఆమెను జుట్టు పట్టుకుని పిడిగుద్దులు గుద్దుతూ విచక్షణారహితంగా చితకబాదాడు. స్థానికులు అడ్డుకుంటున్నా దాడికి తెగబడ్డాడు. ఆమె పెద్దగా కేకలు వేస్తూ కింద పడిపోయింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గాయపడిన లక్ష్మిని స్థానికులు ద్విచక్రవాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బ్రహ్మసముద్రం మండల పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

మహనీయుల స్ఫూర్తితో సమగ్రాభివృద్ధి

గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ పి.రాజాబాబు

- అత్యుత్తమ సేవలందించిన 504 మంది ఉద్యోగులు, అధికారులకు ప్రశంసా పత్రాలు
- ఆకట్టుకున్న శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు



జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మహనీయుల స్ఫూర్తితో కృష్ణాజిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. మచిలీపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండులో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎస్పీ పి.జాషువా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. 1950, జనవరి 26న భారతదేశం గణతంత్ర దేశంగా ఆవిర్భవించిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని చెప్పారు. స్వాతంత్ర్యోద్యమంలో కృష్ణాజిల్లాకు చెందిన నాయకుల పాత్ర ఎంతో ఉందన్నారు.

జిల్లా వార్షిక నివేదిక ఇదీ..

డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా నాలుగేళ్లలో 1.50 లక్షల మంది రైతులకు రూ.1,006 కోట్లను ఐదు విడతల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేశామని కలెక్టర్ తెలిపారు. ఈ ఏడాది రూ.4,344 కోట్లను పంట రుణాలుగా, రూ.2,513 కోట్లను దీర్ఘకాలిక రుణాలుగా ఇచ్చామని చెప్పారు. నాలుగేళ్లలో 1.50 లక్షల మంది రైతులకు రూ.1.26 కోట్లను పంట నష్టపరిహారంగా చెల్లించామన్నారు. సున్నావడ్డీగా 1.26 లక్షల మంది రైతులకు రూ.24 కోట్లను, 67 వేల మంది రైతులకు రూ.121.65 కోట్లను పంటబీమాగా అందించామన్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా జిల్లాలోని 587 పాఠశాలల్లో మొదటి విడతగా రూ.126 కోట్లతో పనులు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రెండో విడతలో 441 పాఠశాలల్లో రూ.180 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అమ్మ ఒడి ద్వారా నాలుగేళ్లలో రూ.2,105 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది 11,730 మందికి ట్యాబ్‌లను ఉచితంగా ఇచ్చామని కలెక్టర్ పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో ఈ ఏడాది 66.15 లక్షల పనిదినాలను కల్పించి రూ.167.80 కోట్ల విలువైన పనులు చేశామన్నారు.

వేగంగా పోర్టు పనులు

రూ.5,156 కోట్ల తొలివిడత అంచనాలతో బందరు పోర్టు పనులు ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. సౌత్‌బ్రేక్ వాటర్ నిర్మాణ పనులు 1,550 మీటర్ల మేర పూర్తయిందని, నాలుగు బెర్తుల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మచిలీపట్నం మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యాయని, 150 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం వివిధ శాఖల్లో అత్యుత్తమంగా పనిచేసిన ఉద్యోగులు, అధికారులు 504 మందికి ప్రశంసా పత్రాలను జేసీ గీతాంజలిశర్మ, ఎస్పీ వివిధ శాఖల జిల్లా అధికారుల చేతులమీదుగా అందజేశారు. కాగా, పరేడ్ గ్రౌండులో ఏర్పాటుచేసిన 17 స్టాళ్లను అధికారులు పరిశీలించారు. వివిధ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు దేశభక్తిని చాటుతూ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

జనగణమన



ప్రథమ స్థానం సాధించిన విద్యాశాఖ శకటం

జాతీయ పతాకం జనకెరటమైంది. జయహో.. నినాదం విజయగీతిక పలికింది. ఎల్లడెలా దేశభక్తి రెపరెపలాడింది. ఊర్లు, వాడలు స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చాయి. వీధుల్లో జాతీయ జెండాలు వినువీధిని తాకాయి. ఆసేతు హిమాచలానికి స్వేచ్ఛా వాయువులు ప్రసాదించిన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అన్ని వర్గాలవారు మువ్వన్నెల పతాకాలను ఎగురవేశారు. మహోజ్వలంగా సాగిన నాటి స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుండి నడిపిన మన జిల్లా నేతలను స్మరిస్తూ సెల్యూట్ చేశారు. పోలీసుల గౌరవ వందనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు దేశభక్తిని రగల్చగా, ప్రభుత్వ శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రజా సేవలో పునరంకితమైన ప్రభుత్వ అధికారులను ప్రశంసాపత్రాలు వరించాయి.

జిల్లావ్యాప్తంగా ఘనంగా గణతంత్ర దినోత్సవం



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



మచిలీపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

సీట్లు.. పాట్లు..

'సీటు వస్తుందా.. రాదా..' రెండు జిల్లాల వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేల మదిలో మెదులుతున్న మాట ఇది. సీటు ఓకే చేస్తే సరి.. లేదంటే టీడీపీ-జనసేన వైపే వెళ్లాలని తెగ మదనపడిపోతున్నారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు అధినేత చంద్రబాబుకు టచ్‌లో ఉండగా, వారందరికీ సీట్లు ఎక్కడ సర్దుబాటు చేయాలనేది పెద్ద ఫజిల్‌గానే మారింది. ఇక వైసీపీలో అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి ఏర్పడింది. సిటింగ్‌లంతా పక్క చూపులు చూస్తుంటే, అసలు అభ్యర్థులే కరువయ్యే దుస్థితి నెలకొంది.



చంద్రబాబు వద్దకు క్యూ కడుతున్న వైసీపీ సిటింగ్‌లు

టీడీపీలో పోటీ.. వైసీపీలో అభ్యర్థులు కావలెను..

- సర్దుబాటు చేయలేక టీడీపీ పెద్దలు సతమతం
- పెనమలూరు ఎమ్మెల్యే సారథికి నూజివీడులో అవకాశం
- క్యూలో మరో ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు
- సీటు ఖరారు చేసిన మరుక్షణం జంప్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైనాట్ 175.. అంటూ హడావుడి చేసిన వైసీపీ ఇప్పుడు అభ్యర్థుల కోసం వెతుకులాడుకోవాల్సిన పరిస్థితికి చేరింది. టీడీపీ తరఫున పోటీ చేసేందుకు సరైన అభ్యర్థులు కూడా లేరంటూ నిన్నటి వరకు వైసీపీ నాయకులు విమర్శలు చేయగా, నేడు అదే టీడీపీ టికెట్ కోసం వైసీపీ ఎమ్మెల్యేలే క్యూ కడుతున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సీట్లను సర్దుబాటు చేయలేక టీడీపీ పెద్దలు సతమతమవుతుంటే, వైసీపీలో అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. టీడీపీ, జనసేన నడుమ పొత్తు ఉండటంతో ఒక్కో సీటుకు టికెట్ ఆశించే ఆశావహుల జాబితా రోజురోజుకు పెరిగిపోతోంది. పొత్తులో భాగంగా ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నుంచి మూడు లేదా నాలుగు అసెంబ్లీ స్థానాలను, ఒక ఎంపీ స్థానాన్ని జనసేనకు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ, జనసేన నుంచి టికెట్లు ఆశించే వారి సంఖ్య కృష్ణాజిల్లాలో కంటే ఎక్కువగా ఉంది. వైసీపీ నుంచి పలువురు ఎమ్మెల్యేలు టీడీపీలోకి క్యూ కడుతుండటంతో ఇక్కడ టికెట్ల సర్దుబాటు టీడీపీ, జనసేన పెద్దలకు తలనొప్పిగా తయారైంది. ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటి వరకు ఎవరికీ అధికారికంగా టికెట్ ఖరారు చేయలేదు. అయితే, మైలవరం నుంచి దేవినేని ఉమా, సెంట్రల్ నుంచి బొండా ఉమా, తూర్పు నుంచి గద్దె రామ్మోహన్, నందిగామ నుంచి తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట నుంచి శ్రీరాం తాతయ్యకు దాదాపు టికెట్ ఖరారైనట్టే. పశ్చిమ నుంచి టీడీపీ తరఫున జలీల్‌ఖాన్‌తో పాటు పలువురు నేతలు పోటీపడుతున్నారు. జనసేన నుంచి పోతిన మహేశ్, బాడిత శేఖర్ రేసులో

- మిగతా 6లో

కృష్ణాజిల్లాలో..

కృష్ణాజిల్లాలో గుడివాడ, గన్నవరం స్థానాలకు ఇప్పటికే అభ్యర్థులు ఖరారు కాగా, మిగిలిన ఐదు స్థానాల్లో మచిలీపట్నం నుంచి కొల్లు రవీంద్రకు టికెట్ దాదాపు ఖరారైనట్టే. పెడన, అవనిగడ్డ, పెనమలూరు స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది. పెడన నుంచి టీడీపీ తరఫున కాగిత కృష్ణప్రసాద్, బూరగడ్డ వేదవ్యాస్ టికెట్ రేసులో ఉన్నారు. అవనిగడ్డ నుంచి సీనియర్ నాయకుడు మండలి బుద్ధప్రసాద్ రేసులో ఉండగా, ఈ రెండు స్థానాల నుంచి జనసేన నుంచి కూడా పలువురు ఆశావహులు టికెట్ ఆశిస్తున్నారు. ఇక పెనమలూరు నియోజకవర్గానిది ప్రత్యేక పరిస్థితి. నిన్నటి వరకు వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న కె.పార్థసారథి ఇదే స్థానం నుంచి టీడీపీ టికెట్ ఆశించారు. అయితే, సారథికి నూజివీడు స్థానాన్ని ఖరారు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును బుధవారం రాత్రి సారథి హైదరాబాద్‌లో కలిశారు. ఆ సమయంలో నూజివీడుపై సారథికి స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. దీంతో పెనమలూరులో బోడె ప్రసాద్‌కు లైన్‌క్లియర్ అయినట్టే. కాగా, ఎన్టీఆర్ జిల్లాలో స్థానాల సర్దుబాటు ప్రభావం కృష్ణాజిల్లాలో ఉన్న ఈ స్థానంపై పడే అవకాశాలున్నాయి. పామర్రు నుంచి వర్ల కుమార్‌రాజా రేసులో ఉన్నా చివరి నిమిషంలో మార్పులు చేర్పులకు అవకాశం లేకపోలేదు.



జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాల అంశం వీఆర్వోల మెడకు చుట్టుకుంది. డిజిగ్నేటెడ్ అధికారాలున్న తహసీల్దార్లను కాదని.. వీఆర్వోలే ఈ రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వం మెలికపెట్టింది. అంతటితో ఆగకుండా వీఆర్వోలు తమ ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని చెప్పడంతో అసలు సమస్య ఏర్పడింది. వ్యక్తిగత వివరాలు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో తాము ఇబ్బందులు పడతామని వీఆర్వోలు తలలు పట్టుకుని కూర్చున్నారు.

వీఆర్వోలపై ఉచ్చు

నేటి నుంచి జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

- తహసీల్దార్లు కాకుండా వీఆర్వోలకు బాధ్యతలు
- వ్యక్తిగత సమాచారం ఇవ్వాలని ఆదేశాలు
- అలా అయితే, తమకు ఇబ్బందంటున్న వీఆర్వోలు
- టాన్ నెంబర్ల ప్రాతిపదికన అధికారాలివ్వాలని డిమాండ్

విజయవాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జగనన్న కాలనీల్లో ఇళ్లు ఇచ్చిన వారికి శనివారం నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. ఈ ప్రక్రియ ఏమో గానీ, గ్రామ రెవెన్యూ అధికారులకు (వీఆర్వోలు) మాత్రం కంటి మీద కునుకు లేకుండాపోయింది. రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో డిజిగ్నేటెడ్ అధికారులుగా ఉండాల్సిన తహసీల్దార్లను కాదని, వీఆర్వోలను అనధికారికంగా నియమించారు. వీఆర్వోలను డిజిగ్నేటెడ్ అధికారులను చేయటం ఒక ఎత్తయితే, వారి ఆధార్, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని కోరటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సందేహాలు అనేకం

రిజిస్ట్రేషన్లు చేయాల్సిన వీఆర్వోలంతా తక్షణం తమ ఆధార్ కార్డులతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని నిర్దేశించారు. అయితే, ఇలా వ్యక్తిగత సమాచారాన్ని కోరటం వల్ల సమస్యలొస్తాయని వీఆర్వోలు భయపడుతున్నారు. ప్రైవేటుగా రిజిస్ట్రేషన్లు చేసిన వారి జాబితాలో తాము కూడా చేరతామని ఆందోళన చెందుతున్నారు. ఒక్కో వీఆర్వో పరిధిలో సగటున 1,100 మంది జగనన్న ఇళ్ల లబ్ధిదారులుంటారు. ఈ విధానంలో అయితే వారందరికీ అదే వీఆర్వో వ్యక్తిగతంగా రిజిస్ట్రేషన్ చేసినట్టవుతుంది. ఇలా చేయటం వల్ల వీఆర్వోలకు రెండు రకాలుగా ఇబ్బందులు ఉంటాయి. భవిష్యత్తులో ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు అందుకునే ప్రమాదం ఉంది. వ్యక్తిగతంగా లెక్కకుమించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నందున ఆదాయపు పన్ను శాఖ దృష్టిలో భారీగా ఆస్తులు విక్రయించినట్టుగా భావించే ప్రమాదం ఉంది. ఆదాయపు పన్ను శాఖ నోటీసులు ఇస్తే చిరుద్యోగులమైన తమ పరిస్థితి ఏమిటని భయపడుతున్నారు. ఇక రెండో సమస్య.. ఏదైనా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వివాదం తలెత్తి కోర్టు కేసుల వరకు

- మిగతా 6లో

మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

- మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా బాపిరాజు
- తాడిగడపకు వెంకటేశ్వరరావు, గుడివాడకు శ్రీకాంత్‌రెడ్డి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి. మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జి.చంద్రయ్యను బదిలీ చేసి, ఆయన స్థానంలో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్‌వీవీఎస్ బాపిరాజును నియమించారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.సూర్యప్రకాశరావును మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీకి అదనపు కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఒంగోలు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును నియమించారు. గుడివాడ మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ కూడా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రామచంద్రాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. గుడివాడ మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు బదిలీ కాగా, ఆయన స్థానంలో రాజాం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న టీవీ కృష్ణారావు నియమితులయ్యారు. గుంటూరు జిల్లా నరసరావుపేట డివిజన్ అడల్ట్ ఎడ్యుకేషన్ ఏపీవోగా ఉన్న జి.మల్లికార్జున రావును తాడిగడప మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ముమ్మిడివరం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జి.లోవరాజు.. తిరువూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో జోనల్ కమిషనర్‌గా ఉన్న ఎం.కృష్ణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. వీఎంసీలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న డి.వెంకటలక్ష్మిని బదిలీచేసి అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలోని జి.సృజనను నియమించారు. మచిలీపట్నం అసిస్టెంట్ కమిషనర్ బి.జ్యోతిలక్ష్మిని బదిలీ చేశారు.

ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు

విజయవాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. ఎక్సైజ్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణా జిల్లా గుడివాడ డిపోలో పనిచేస్తున్న ఎ.జయశ్రీ, టి.నాగవాణిలను తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని డిస్టిలరీ విభాగానికి బదిలీ చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని గొల్లపూడి డిపోలో ఉన్న వి.వైకుంఠరావును ఉభయగోదావరి జిల్లాల డిస్టలరీ విభాగానికి బదిలీ చేశారు. ఈయన స్థానంలోకి భీమవరం నుంచి ఈఎస్‌వోగా ఉన్న కె.ప్రకాశ్‌ను నియమించారు. గొల్లపూడిలోని ఈఎస్‌వోగా ఉన్న సీహెచ్ తరంగణిని చాగల్లు ఈఎస్‌వోగా బదిలీ చేశారు. నిడమానురు డిపోలో ఉన్న జె.రమేష్‌ను రాజమహేంద్రవరం ఈఎస్‌వోగా బదలీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కాంటినెంటల్ వైన్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఉన్న ఎ.పద్మజను భీమవరం బదిలీ చేశారు. పెద్దవరం క్రక్స్ బయోటెక్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఉన్న బి.నాగభూషణంను ఉభయగోదావరి జిల్లా డిస్టిలరీ విభాగానికి బదిలీ చేశారు. ఉయ్యూరు కేసీపీ లిమిటెడ్‌లో ఉన్న ఒ.శారదను ఉభయగోదావరి జిల్లాల్లో డిస్టలరీ విభాగానికి పంపారు. గండేపల్లిలోని సెంటినీ బయోటెడ్ ప్రొడక్ట్స్‌లో ఉన్న ఒ.మాధవిని ఏలూరులోని బేవరేజస్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. విజయవాడ ఈఎస్‌వోగా ఉన్న వై.అశోక్‌కుమార్‌ను గుంటూరు జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు బదిలీ చేశారు. విజయవాడ డిస్టిలరీస్ విభాగంలో ఉన్న కె.వనజున మదనపల్లె డిపో ఈఎస్‌వోగా బదిలీ చేశారు. కాకినాడ జిల్లా సామర్లకోట డిపోలో ఉన్న పి.మహత్మరాజును గుడివాడ డిపోకు బదిలీ చేశారు. ఏలూరు జిల్లా విజిలెన్స్ విభాగంలో ఉన్న ఆర్వీ రామశివను గొల్లపూడి ఈఎస్‌వోగా బదిలీ చేశారు. ఏలూరు జిల్లా డిపోలో ఉన్న ఎస్వీ రమేష్‌ను నిడమానురు ఈఎస్‌వోగా, పశ్చిమగోదావరి జిల్లా చాగల్లులో ఈఎస్‌వోగా ఉన్న ఎన్.కృష్ణప్రసాద్‌ను కృష్ణా జిల్లా డిస్టిలరీ విభాగానికి పంపారు. కోనసీమ జిల్లా రామచంద్రపురం ఆర్ఓస్ బేవరేజస్‌లో ఉన్న డి.దుర్గాప్రసాద్‌ను గుడివాడ డిపోకు బదిలీ చేశారు.

సీట్లు.. పాట్లు..

5వ పేజీ తరువాయి)

ఉన్నారు. తిరువూరు నుంచి శావల దేవదత్ రేసులో ఉన్నారు. అయితే, వైసీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరికి ఎక్కడ అవకాశం కల్పించాలన్న దానిపై టీడీపీ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు. వీరితో పాటు టీడీపీలో చురుగ్గా ఉంటున్న వంగవీటి రాధాకు అవకాశం కల్పించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్‌చార్జులుగా కొనసాగుతున్న వారిలో కొందరికి టికెట్లు లభించే పరిస్థితి లేదు.

వైసీపీలో భిన్నమైన పరిస్థితి

టీడీపీలో టికెట్ల కోసం విపరీతమైన పోటీ నెలకొంటే, వైసీపీలో అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. కృష్ణాజిల్లాలో పరిస్థితి కాస్త బాగున్నా ఎన్టీఆర్ జిల్లాలో మాత్రం అభ్యర్థుల వెతుకులాట తప్పేట్టు కనిపించడం లేదు. ఏ ఎమ్మెల్యే ఎప్పుడు పార్టీని వీడుతారో తెలియని పరిస్థితుల్లో వైసీపీ పెద్దలు ప్రత్యామ్నాయం కోసం వెతుకులాడుతున్నారు. తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి ఇప్పటికే పార్టీని వీడుతానని ప్రకటించగా, మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. టీడీపీ నుంచి టికెట్ ఖరారైన మరుక్షణం వారు పార్టీని వీడటం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో రెండు అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ కొత్త అభ్యర్థుల కోసం వెతుకులాట ప్రారంభించింది. కృష్ణాజిల్లాలో మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిపై వైసీపీ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌ను ఎంపీగా బరిలోకి దింపితే, అవనిగడ్డ కోసం కొత్త అభ్యర్థిని అన్వేషించాల్సి ఉంటుంది.

వీఆర్వోలపై ఉచ్చు

5వ పేజీ తరువాయి)

వెళ్తే, వ్యక్తిగతంగా రిజిస్ట్రేషన్ చేసిన వీఆర్వోలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. కోర్టు కేసులకు కూడా వారే హాజరుకావాలి. బదిలీపై వేరేచోటకు వెళ్లినా కోర్టు కేసులకు హాజరు కావాల్సి ఉంటుంది.

తహసీల్దార్లకే ఇవ్వాలి

తహసీల్దార్లకు డిజిగ్నేటెడ్ పవర్స్ ఇవ్వడమే ఈ సమస్యకు పరిష్కారంగా ఉంది. తహసీల్దార్లు అయితే వారి టాన్ నెంబర్ల ప్రాతిపదికన ప్రభుత్వం తరఫున రిజిస్ట్రేషన్ చేస్తారు. దీంతో వ్యక్తిగతంగా వారేమీ రిజిస్ట్రేషన్ చేసినట్టుగా నమోదు కాదు. వీఆర్వోల్లో చాలామందికి టాన్ నెంబర్లు లేవు. వారందరికీ టాన్ నెంబర్లు కల్పించటం ద్వారా డిజిగ్నేటెడ్ అధికారాలు ఇస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఈ వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళా వీఆర్వోలు మరింత ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే మండల స్థాయిలో తహసీల్దార్లకు, జిల్లాస్థాయిలో డీఆర్వోలకు తమ అభ్యంతరాలను తెలియజేశారు. అయినా తమ సమస్యను వినకపోవటంతో తాజాగా రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాసినట్టు తెలుస్తోంది.

ఘనతంత్రం

- వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు
- పరేడ్ గ్రౌండ్స్‌లో అబ్బుర విన్యాసాలు
- ఆకట్టుకున్న శకటాలు



విజయవాడ బాపూ మ్యూజియంలోని లేజర్ షోలో ఆకర్షణీయంగా ఎర్రకోట రూపం

మది నిండా జాతీయతా భావంతో.. ఎక్కడ చూసినా రెపరెపలాడుతున్న మువ్వన్నెల జాతీయపతాకంతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో గణత్రంత వేడుకలు ఘనంగా జరిగాయి. దేశం కోసం అసువులు బాసిన త్యాగమూర్తులను అధికారులు, రాజకీయ నేతలు స్మరించుకున్నారు. ఆ ఆదర్శమూర్తుల ఆశయాల సాధనకు కంకణబద్ధులవుదామని ప్రతినబూనారు. ప్రతిఒక్కరూ భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. వేడుకల్లో భాగంగా బందరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో చిన్నారుల విన్యాసాలు అబ్బుర పరిచాయి. ఇరు జిల్లాల్లో వివిధ శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి.





ప్రశంసా పత్రాలు అందుకుంటున్న వెంకటేశ్వరరావు (సర్వేశాఖ ఏడీ), సువర్ణ (జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి), ఎం.వాణి, (మచిలీపట్నం ఆర్డీవో), రాజ్యలక్ష్మి (ముడా వీసీ), మన్నెం భాస్కరరావు (ఎలక్ట్రికల్ ఈఈ), పార్వతి (జిల్లా పౌర సరఫరాల అధికారి), వి.వి.ఫణికుమార్ (జిల్లా కో ఆపరేటివ్ అధికారి), కామరాజు (జిల్లా వికలాంగుల శాఖ ఏడీ), ప్రసాద్ (డీఆర్‌డీఏ పీడీ), జి.వి. సూర్యనారాయణ (హౌసింగ్ పీడీ), తాహెరా సుల్తానా (డీఈవో), గీతాబాయి (జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి), చంద్రయ్య(నగర కార్పొరేషన్ కమిషనర్), జ్యోతిబసు (జడ్పీ సీఈవో), ఫణిధూర్జటి (జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి), శ్యామ్ (కలెక్టరేట్ ఎన్నికల అధికారి), లక్ష్మీనారాయణ, లక్ష్మణరావు (రెవెన్యూ శాఖ నాల్గవ తరగతి ఉద్యోగి), వేమూరి ప్రవీణ్ (కలెక్టరేట్ ఉద్యోగి), సులేమాన్ (నాల్గవ తరగతి ఉద్యోగి), సంజీవరావు (నాల్గవ తరగతి ఉద్యోగి), కె. కోదండ రామారావు (వీఆర్వో), ఆర్. చంద్రశేఖర పున్నయ్య (పోలీసు ఇంటిలిజెన్స్), హబీబ్ బాషా (రూరల్ సీఐ), పద్మ (మచిలీపట్నం రూరల్ ఎస్ఐ), శేషుకుమార్ (పోలీసు శాఖ), చాణక్య (మచిలీపట్నం రూరల్ ఎస్ఐ 2), నాగప్రసాద్ (సీఐ), శ్రీమన్నారాయణ (పోలీసు శాఖ), ఎస్‌కె ఫిరోజ్ (పోలీసు శాఖ), వి.వెంకటేష్ (పోలీసు శాఖ), ఏ.వెంకటేశ్వరరావు (పోలీసు శాఖ), ఎల్.ఆర్. మోహనరావు (పోలీసుశాఖ), రహమాన్ (పోలీసు శాఖ), కిషోర్ (పోలీసు శాఖ), సునీత (జడ్పీ సూపరింటెండెంట్), బి.వి.నాగసాయి (జిల్లా పరిషత్), ఆర్.జోషి (గృహ నిర్మాణ శాఖ), బి. నిస్సిగ్రేస్ (వ్యవసాయ శాఖ), ఎం.డేవిడ్‌రాజు (విద్యాశాఖ), పద్మారాణి, (గుడివాడ డీవైఈవో), ఎండీ సలీం (డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్), రామప్రసాద్ (విద్యాశాఖ), బి.శ్రీనివాసరావు (విద్యాశాఖ), ఈశ్వర ఉదయకుమార్ (వైద్యశాఖ), ఏ.గాయత్రి (నాగాయలంక క్రీడాకారిణి), కె.రామకృష్ణ, ఏఈ, విద్యుత్ శాఖ), విజయకుమార్, (సబ్ రిజిస్టార్), బాబు (వెలుగు ఫౌండేషన్), పెద్దిరాజు (ఆర్టీసీ డిపో మేనేజర్), ఏ.శ్రీనివాసరావు (డివిజనల్ పీఆర్‌ఓ, పౌర సంబంధాల శాఖ), కరెడ్ల అంజనీకుమార్ (వైద్యశాఖ), పాండురంగారావు (గ్రంథాలయ సంస్థ), బసవేశ్వరరావు, (లైబ్రేరియన్, పెడన), సుధాకర్, కార్యనిర్వహణాధికారి, (దేవాదాయ ధర్మాదాయ శాఖ), కోటిరెడ్డి (పౌర సరఫరాల శాఖ), ప్రసాద్ (ఏఆర్ ఏఎస్పీ), బాలాజీ (జిల్లా పౌర సంబంధాల శాఖ), ఝాన్సీలక్ష్మి (జిల్లా క్రీడాశాఖాధికారి), మాదవేంద్రరావు (చల్లపల్లి గ్రామ పంచాయతీ ఈవో) ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

ప్రతిభకు 'ప్రశంస'

504 మందికి ప్రశంసాపత్రాలు

మచిలీపట్నం టౌన్, జనవరి 26 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ప్రతిభ కనబరిచిన వివిధ శాఖలకు చెందిన 504 మంది అధికారులు, ఉద్యోగులకు శుక్రవారం ప్రశంసా పత్రాలు అందించారు. కన్నులపండువగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల నుంచి నాలుగవ తరగతి ఉద్యోగుల వరకు కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా, జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో పెద్ది రోజాలు ప్రశంసాపత్రాలు, అవార్డులు అందించారు.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం మచిలీపట్నం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన నాట్య ప్రదర్శనలు దేశభక్తిని రగిల్చాయి.



- ప్రధాన కాలువలు, డ్రెయిన్‌లలో పూడికతీత పనులు శూన్యం
- జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు మృగ్యం
- అటకెక్కిన రహదారుల అభివృద్ధి
- నేడు జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం
- ఎమ్మెల్యేలకు, ఎంపీలకు ఆఖరు సమావేశం

"జిల్లాలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. నాలుగున్నరేళ్లుగా ప్రజలు మొత్తుకుంటున్నా రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ధాన్యం కొనుగోళ్లలో చిక్కుముడులు ఇప్పటికీ వీడలేదు. ప్రభుత్వమే కొర్రీలు పెట్టి రైతులను దళారులపాలు చేస్తోంది. జగనన్న కాలనీల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఇలా అన్నీ సమస్యలే. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన శనివారం జడ్పీ కన్వెన్షన్ హాలులో జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంలోనైనా ప్రజా సమస్యలపై చర్చ జరిగితే కొంతైనా మేలు జరుగుతుంది. జిల్లాకు చెందిన మంత్రి, శాసనసభ్యులు, ఎంపీలకు దాదాపు ఆఖరు సమావేశం కానుంది

– మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

ఎక్కడి సమస్యలక్కడే..!

ధాన్యం కొనుగోళ్లలో గందరగోళం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వ్యవహారం అస్తవ్యస్తంగా ఉంది. జిల్లాలో రహదారుల అభివృద్ధి, రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులకు ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై ఎలాంటి చర్చ జరుగుతుందో చూడాలి. గత రెండు దఫాలుగా జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశాలకు ఏలూరు జిల్లా కలెక్టర్ హాజరు కాకపోవడంపై మాజీమంత్రి పేర్ని నాని తనదైన శైలిలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

గతేడాది ఖరీఫ్‌సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 3.20 లక్షలహెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. సాగు ప్రారంభ దశలో కురిసిన భారీవర్షాల కారణంగా వెదజల్లే పద్ధతి ద్వారా నాట్లు పూర్తిచేసిన లక్ష ఎకరాలకుపైగా వరిపైరు నీటమునిగింది. ఈ-క్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేయకపోవడంతో దెబ్బతిన్న వరిపైరుకు పంట నష్టపరిహారం ఇవ్వలేదు. డిసెంబరులో మిచౌంగ్ తుఫాను కారణంగా కురిసిన భారీవర్షాలకు పంట దెబ్బతింది. ఈ ఏడాది ప్రత్యేక పరిస్థితుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోలును ఆఫ్‌లైన్‌లో గత 15 రోజుల వరకు చేశారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కృష్ణాజిల్లాలోనే ఆన్‌లైన్ నింధనలను అమలుచేస్తూ, మిగిలిన జిల్లాలో ఆఫ్‌లైన్‌లో ధాన్యం తరలించేస్తున్నారని రైతులు అంటున్నారు. ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసే అంశంపై జడ్పీ సమావేశంలో ప్రశ్నించేందుకు ప్రజా ప్రతినిధులు సమాయాత్తమతున్నారు.

● పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి

రానున్న వేసవిలో సముద్రతీర ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడిని ఎలా ఎదుర్కొంటారనే అంశంపై అనేక అనుమానాలున్నాయి. పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం 15 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ వేసవిలో తాగునీటి చెరువులను నింపేందుకు నీటి విడుదల ఎప్పటికి చేస్తారనే అంశంపై స్పష్టత లేదు. మార్చి, మే నెలల్లో రెండు విడతలుగా ప్రధాన కాలువలకు నీటిని విడుదలచేస్తే తాగునీటి చెరువులను నింపేందుకు అవకాశం ఉంటుంది. నీటి లభ్యత పూర్తిస్థాయిలో లేకపోవడంతో తాగునీటి ఎద్దడి నివారణ కోసం తీసుకునే చర్యలపైనా ఈ సమావేశంలో చర్చ జరిగి సముచిత నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

● జగనన్న కాలనీలపై చర్చ జరిగేనా?

ఉమ్మడి జిల్లాలో 1400లకుపైగా జగనన్న లేఅవుట్‌లు ఉన్నాయి. వాటిలో కనీస వసతులు లేవు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ లేఅవుట్‌లలో రహదారుల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్లు, విద్యుత్‌లైన్లు ఏర్పాటువంటి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ఎంతమేర ఈ పనులు చేస్తారనే అంశంపైనా అనుమానాలున్నాయి. కృష్ణాడెల్టాకు నీటి విడుదలను నిలిపివేశారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల వరకు ప్రధాన పంటకాలువలు, డ్రెయిన్‌ల మరమ్మతులు చేసేందుకు అవకాశం ఉంది. డ్రెయిన్‌లలో సక్రమంగా పూడిక తీయకపోవడంతో డిసెంబరు నెలలో కురిసిన భారీవర్షాలకు పొలాల్లో నీరు వారం రోజులకు పైబడి ఉండటంతో వరి పంట దెబ్బతిన్నది. ఈ సమావేశంలో ప్రధాన కాలువలు, డ్రెయిన్‌లలో పనులు చేసేందుకు అంచనాలు, నిధుల కేటాయింపుపై చర్చ జరిపి సముచిత నిర్ణయం తీసుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

సుబాబుల్ రైతుల ఆందోళన

చందర్లపాడు, జనవరి 26 : సుబాబుల్ కర్ర ధర తగ్గించటంతో ఆగ్రహించిన రైతులు కోనాయపాలెం వేబ్రిడ్జి వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. పేపరు కంపెనీలు టన్నుకు రూ.500 వంతున ధర తగ్గించటాన్ని మండలంలోని కోనాయపాలెం రైతులు తీవ్రంగా ఖండించారు. కర్ర సరఫరా ఎక్కువగా ఉందని, ధర తగ్గించటం దారుణమని అన్నారు. టన్నుకు రూ.5300 వంతున ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు అక్కడి వేబ్రిడ్జి వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని, వేబ్రిడ్జిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు గుత్తికొండ రాంబాబు పాల్గొన్నారు.


32 మంది ఎంపీడీవోల బదిలీ

మచిలీపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాలో మూడేళ్లగా పనిచేస్తున్న ఎంపీడీవోలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సాధారణ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో సొంత జిల్లాలో గత మూడు సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్న ఎండీవోలను బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన ఎంపీడీవోలను కృష్ణా జెడ్పీ సీఈవో వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. 22 మంది ఎండీవోలను గుంటూరు జిల్లాకు, మరో పది మంది ఎంపీడీవోలను పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ చేశారు.

జనం తరిమికొడతారని జగన్‌కు భయం : నెట్టెం

విద్యాధరపురం, జనవరి 26 : ఓటమి కాదు.. ప్రజా తిరుగుబాటు ఊహించిన సీఎం జగన్‌ను జనం తరిమి కొడతారనే భయంతో తప్పుకుంటానంటూ కథలు చెబుతున్నారని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్ విమర్శించారు. శుక్రవారం విజయవాడ ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 ఏళ్లుగా ప్రజలను దోచుకుని దాదాపు రూ.4 లక్షల కోట్లను వెనకేసుకున్నావని విమర్శించారు. కేశినేని నాని ఆయన చేతులారా తన రాజకీయ సమాధి తవ్వుకున్నాడని విమర్శించారు.

వర్తమాన విషయాలపై అవగాహనతో విద్యార్థుల ఎదుగుదల



పటమట, జనవరి 26 : ప్రపంచంలో చోటుచేసుకుంటున్న రోజువారీ పరిణామాలను తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు తమను తాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలరని బీఆర్ అంబేడ్కర్ ఓపేన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగా జోషీ అన్నారు. వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలలోని పాఠశాల స్థాయి విద్యార్థులకు గొల్లపూడి ఎస్పీఎన్ఆర్‌సి హైస్కూల్‌లో శుక్రవారం క్విజ్, వ్యాసరచన పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందించి, సర్టిఫికెట్లు, పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ, వడ్లమూడి పద్మ, రవితేజ పాల్గొన్నారు.

అవినీతిరహిత సమాజాన్ని నిర్మిద్దాం

విజయవాడ రూరల్, జనవరి 26: ప్రతి పౌరుడు అవినీతిని అడ్డుకుని అవినీతి రహిత సమాజం స్థాపనకు కృషి చేయాలని నేషనల్ విజిలెన్స్ అండ్ క్రైమ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎస్.కాశీవిశ్వనాథ్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పినైనవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవినీతి నిర్మూలన చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించి అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎస్.రియాజ్, పూర్ణచంద్రరావు, న్యాయవాది పవన్, మోహనరావు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నేషనల్ విజిలెన్స్ అండ్ క్రైమ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎస్.కాశీవిశ్వనాథ్

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

● కార్యకర్తలకు టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ పిలుపు



యువదళం లోగో, టీ షర్ట్‌లను ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జనవరి 26: టీడీపీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో గన్నవరం యువదళం లోగో, టీ షర్ట్‌లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కుటుంబ సాధికార సారథుల నియామకాలు సత్వరం పూర్తిచేసి ఫిబ్రవరి 4న తెలుగుయువత, 11న తెలుగుమహిళల ఆధ్వర్యంలో జరగబోయే బహిరంగ సభలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు వడ్రాణం హరిబాబునాయుడు, నేతలు జాస్తి వెంకటేశ్వరరావు, గొడ్డళ్ల చిన్నరామారావు, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, దయాల రాజేశ్వరరావు, చిరుమామిళ్ల సూర్యం, బజ్జుల బోస్, దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, ఎం.సాయి కల్యాణి, మండవ లక్ష్మి, మేడేపల్లి రమాదేవి, పరుచూరి నరేష్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మినుముపైరు దగ్ధం

● విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రూ.3లక్షలు నష్టం

ఉంగుటూరు, జనవరి 26: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఆ కౌలురైతు పాలిట శాపంగా మారింది. చేతికొచ్చిన పంట కళ్లెదుటే అగ్నికి ఆహుతవుతుంటే మౌనంగా రోదిస్తూ పంటను రక్షించుకునేందుకు ఉరుకులు, పరుగులు పెట్టాడు. తోటిరైతుల సాయంతో సమీపంలోని బుడమేరులోని నీటిని తెచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాడు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రెండున్నర ఎకరాల్లో మినుము పంట పూర్తిగా కాలి బూడిదైన ఘటన కొయ్యగూరపాడులో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. ఆముదాలపల్లికి చెందిన దాసరి నాగేంద్రబాబు కొయ్యగూరపాడులో మూడెకరాలు కౌలుకు తీసుకుని దాళ్వాగా మినుము పైరు వేశాడు. ఎకరానికి రూ.30వేల పెట్టుబడి పెట్టాడు. ఎకరానికి 10 నుంచి 12 బస్తాల వరకు దిగుబడి వస్తుందని ఆశించాడు. మరో నెలరోజుల్లో పంట చేతికి వస్తుందనుకున్న తరుణంలో పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వెళ్లే కరెంట్ వైర్లు కిందికి వేలాడుతూ ఒకదానికొకటి కలవడంతో నిప్పురవ్వలు చెలరేగాయి. కింద చెత్తపై పడి పొలంలోకి మంటలువ్యాపించి మినుముపంట దగ్ధమైంది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌స్తంభాలకు వెళ్తున్న లైన్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, గత ఏడాది మార్చి నుంచి పలుమార్లు అధికారులకు చెప్పినా, పట్టించుకోలేదని, ఫలితంగా రూ.3లక్షల మేర పంటనష్టం జరిగిందని, పూర్తి బాధ్యత విద్యుత్ అధికారులదేనని నాగేంద్ర అన్నారు.

కాలిన పంటను పరిశీలించిన టీడీపీ నేతలు

విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన మినుముపంటను టీడీపీ మండలాధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, స్థానిక నేతలు పోతినేని రామకృష్ణ, రైతులు బొబ్బా వాసుదేవరావు, కంభంపాటి వెంకటసుబ్బారావుతో కలిసి పరిశీలించారు. పంట నష్టపోయిన రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్‌చేశారు.



ఉయ్యూరులో, రేమల్లె హైస్కూల్‌లో జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు, నున్న పంచాయతీ కార్యాలయం వద్ద వేడుకల్లో పాల్గొన్న గ్రామనేతలు



పెనమలూరులో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బోడె ప్రసాద్

వాడవాడలా గణతంత్ర వేడుకలు

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పార్టీ కార్యాలయాల్లో రెపరెపలాడిన త్రివర్ణ పతాకాలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం వాడవాడలా వేడుకలు జరుపుకొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు.

విజయవాడ రూరల్: నున్న పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ జాతీయ జెండాను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ కాటూరి సరళ, ఉపసర్పంచ్ బ్రహ్మారెడ్డి, యార్కారెడ్డి నాగిరెడ్డి, నేతలు అంగజాల హనుమ, దండు సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు. అంబాపురంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ సెంటర్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్నరామారావు ముందుగా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించి, జాతీయ జెండాను ఎగురవేశారు.

హనుమాన్‌జంక్షన్‌లో..

హనుమాన్‌జంక్షన్: విజయవాడ రోడ్డులోని పాలకేంద్రం ఆవరణలో విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. బాపులపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సునీల్‌బాబు, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఏఎన్ నరసింహమూర్తి, జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జనార్దన్, బాపులపాడు ఎంపీపీ స్కూల్ వద్ద ఎంపీపీ వై.నగేష్, బాపులపాడు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సరిపల్లి కమలాభాయి పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలను నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లి విజయ వారి కామధేను పాలఫ్యాక్టరీలో కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు జాతీయజెండాను ఆవిష్కరించారు. ప్లాంట్ మేనేజర్ హరిత, క్లస్టర్ మేనేజర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. వేలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవ వందనాన్ని స్వీకరించారు. నవోదయ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వేములపల్లి శ్రీనివాసరావు, దోనవల్లి రామారావు పాల్గొన్నారు. రేమల్లె హైస్కూల్‌లో హెచ్‌ఎం లూథర్‌పాల్ ఆధ్వర్యంలో జాతీయనాయకుల వేషధారణల్లో విద్యార్థులు 75అడుగుల జాతీయ పతాకాన్ని చేబూని ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ భారతి, దాతలు తుమ్మల వీరరాఘవయ్య, అవిర్నేని విష్ణువర్ధనరావు, స్వర్ణకుమారి పాల్గొన్నారు. వీరవల్లి హైస్కూల్‌లో జడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని జాతీయజెండాను ఆవిష్కరించారు. హెచ్‌ఎం నిర్మల, కృష్ణారావు పాల్గొన్నారు. రంగన్నగూడెం ఎంపీయూపీ స్కూల్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎన్నారై తుమ్మల రాంబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, నత్తా రంజిత్‌కుమార్, హెచ్‌ఎం స్వర్ణలత పాల్గొన్నారు. వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చిరంజీవి జాతీయ పతాకానికి సిబ్బందితో కలిసి గౌరవవందనం చేశారు.



వీరవల్లిలో జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న చలసాని ఆంజనేయులు, ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో..

పోరంకి ప్రధాన కూడలిలో..

పెనమలూరు: మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో పోరంకి ప్రధాన కూడలి వద్ద గణతంత్ర వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులతో కలిసి జాతీయజెండాను ఆవిష్కరించారు. పోరంకి విజ్ఞాన్ భారత్ పాఠశాలలో బోడె ప్రసాద్ పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్ శేషాద్రి పాల్గొన్నారు. సీఐటీయూ పెనమలూరు మండల కమిటీ ఆధ్వర్యంలో తాడిగడప మునిసిపాలిటీ కార్మికనగర్ కట్ట-2 వద్ద నారి వెంకట్రావు జెండా వందనంచేశారు. సీఐటీయూ కార్యదర్శి త్రిమూర్తులు, అన్నవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ వడ్లమూడి సరోజిని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ ఎం.అమీర్‌బాషా పాల్గొన్నారు. వెల్దిపాడు గ్రామ సచివాలయం, జడ్పీహైస్కూల్‌లో సర్పంచ్ లాం నాగేశ్వరరావు జాతీయ జెండా ఎగురవేశారు. హెచ్‌ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో డి.రాజు జాతీయ పతాకం ఎగురవేసి జాతీయ నాయకుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద న్యాయాధికారి కె.శ్రీహరి జాతీయ పతాకం ఎగురవేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపీచంద్, ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, కార్యదర్శి వసుధారాణి, న్యాయవాదులు పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఉయ్యూరు కమిషనర్ వెంకటేశ్వరరావు, అసోసియేషన్ నాయకులు సత్తార్, సాంబశివరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో రక్ష ఫౌండేషన్ ప్రతినిధి స్నిగ్ధ, సురేశ్‌బాబు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశభక్తి గీతాల నృత్యప్రదర్శన, జాతీయ నాయకుల వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఏపీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ దినవహి వీవీ సీతాపతిరావు, క్లబ్ జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ నూకల సాంబశివరావు, క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్, దినవహి ప్రసాద్, ఏజీఅండ్‌ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

గన్నవరంలో..



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు కార్యాలయం వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జాతీయ జెండాను యార్లగడ్డ ఎగురవేసి గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు నివాళులర్పించారు. నియోజకవర్గ పరిశీలకుడు హరిబాబునాయుడు, చిన్నరామారావు, కృష్ణారెడ్డి, రాజేశ్వరరావు, సూర్యం, బోసు, చిన్న, గోపాలకృష్ణ, సాయి కల్యాణి, మండవ లక్ష్మి, ఉమా వరప్రసాద్, నరసయ్య, బాబూరావు, సురేష్, హరికృష్ణ, రమ, రవి పాల్గొన్నారు. టీడీపీ మండల కార్యాలయం వద్ద జాస్తి వెంకటేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేశారు. మండవ అన్వేష్ పాల్గొన్నారు.

సేవకు పురస్కారం



కలెక్టర్ రాజాబాబు నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న తాడిగడప మునిసిపల్ కమిషనర్ ప్రకాశరావు, గన్నవరం ఎంపీడీవో సత్యకుమార్, ఉంగుటూరు, బాపులపాడు డీటీలు శ్రీలత, వెంకటరమణ

గన్నవరం/కంకిపాడు/హనుమాన్ జంక్షన్/హనుమాన్ జంక్షన్‌రూరల్/ ఉయ్యూరు/ ఉంగుటూరు/: మచిలీపట్నంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో విధి నిర్వహణలో ఉత్తమప్రతిభ కనబరిచిన అధికారులు, వివిధ విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు కలెక్టర్ రాజాబాబు నుంచి అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. గన్నవరం ఎంపీడీవో సత్యకుమార్, 108 ఆపరేషన్స్ కంకిపాడు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఎం.వెంకటేశ్వరరావు అవార్డును అందుకున్నారు. బాపులపాడు తహసీల్దార్ కార్యాలయం డీటీ కె.వెంకటరమణ, మండల పంచాయతీ రాజ్ ఏఈ జి.జయరాజు, ఉపాధి హామీ పథకం ఏపీఎం అశోక్‌కుమార్, వీరవల్లి ఎస్సై చిరంజీవి, ఏ ఎస్సై సాయిబాబా, విద్యుత్ శాఖ హనుమాన్‌జంక్షన్ సబ్ డివిజన్ పరిధిలో జంక్షన్ ఏడీఈ బి.శ్రీనివాసరావు, ఉంగుటూరు ఏఈ యు.మురళీకృష్ణ ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. ఉంగుటూరు మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, బాపులపాడు మండలం ఆరుగొలనుకు చెందిన వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్) సాయిశ్రావణికి, వీహెచ్ఏ(విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్) శారద ఉత్తమ పురస్కారాలను కలెక్టర్ రాజాబాబు నుంచి అందుకున్నారు. మచిలీపట్నంలో డీఎంహెచ్‌వో గీతాబాయి నుంచి ఉయ్యూరు మండలం ఆకునూరు గ్రామ సచివాలయ హెల్త్ సూపర్‌వైజర్ పి.పార్వతి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు.

తాడిగడప మునిసిపాలిటీకి అవార్డులు

పెనమలూరు: మచిలీపట్నంలో కలెక్టర్ పి.రాజాబాబు నుంచి తాడిగడప మునిసిపల్ కమిషనర్ డాక్టర్ ప్రకాశరావుకు ఉత్తమ మునిసిపల్ కమిషనర్ అవార్డును అందుకున్నారు. కలెక్టర్ నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యవర్ధనరావు, మేనేజరు విజలక్ష్మి, డీఈ రాజారావు, టీపీవో గిరి, సీనియర్ అసిస్టెంట్లు నాగలక్ష్మి, అరుణకుమారి, జూనియర్ అసిస్టెంట్లు గంగాభవాని, నాగభూషణ్ చౌదరి, ఇంజనీరింగ్ అసిస్టెంటు ఫణీంద్ర, సిబ్బంది శ్రీకాంత్, సతీష్, భార్గవ్ అవార్డులు అందుకున్నారు.



ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జయభారత్‌రావు నుంచి అవార్డును అందుకుంటున్న ఏడీఈ పూర్ణచంద్రరావు, అధికారులు

ఉత్తమ సబ్ డివిజన్‌గా కానూరు ఏపీసీపీడీసీఎల్

పెనమలూరు: కానూరు ఏపీసీపీడీసీఎల్ సబ్ డివిజన్‌కు ఉత్తమ సబ్ డివిజన్ అవార్డు లభించింది. శుక్రవారం విజయవాడలో సంస్థ డైరెక్టర్ జయభారత్‌రావు చేతుల మీదుగా సంస్థ ఏడీఈ పూర్ణచంద్రరావు, ఆయన టీం సభ్యులు అవార్డును అందుకొన్నారు. అవార్డును సాధించడంలో తనకు తోడ్పడిన అధికారులను, సిబ్బందిని ఏడీఈ అభినందించారు.

మానవత సంస్థకు దుట్టా రూ.లక్ష విరాళం

హనుమాన్‌జంక్షన్, జనవరి 26: ప్రజల్లో దేశభక్తిని నింపిన మహాత్మాగాంధీ జీవితం స్ఫూర్తి దాయకమని వైసీపీ సీనియర్ నేత దుట్టా రామచంద్రరావు అన్నారు. శుక్రవారం ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో మానవత సభ్యుడు జన్యావుల సత్యనారాయణ ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని దుట్టా ఆవిష్కరించారు. మానవత కార్యాలయానికి తన కుటుంబం పేరిట దుట్టా రామచంద్రరావు రూ.లక్ష విరాళం అందజేశారు. వైసీపీ నేత గోసుల శివభరత రెడ్డి, మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

బాపులపాడు మండల సమావేశం నేడు

హనుమాన్‌జంక్షన్, జనవరి 26: బాపులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వై.నగేష్ అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో కె.జోగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరు కావాలని ఆయన సూచించారు.

హైస్కూల్‌కు కంప్యూటర్ బహూకరణ

ఉయ్యూరు, జనవరి 26: ఆకునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ అకాడమీ తరఫున కంప్యూటర్‌ను టీడీపీ అధికార ప్రతినిధి, ఎన్ఆర్ఐ లీగల్ అడ్వయిజర్ గొట్టిపాటి వెంకట రామకృష్ణప్రసాద్ అందజేశారు. సర్పంచ్ గోలి వసంతకుమార్, హెచ్‌ఎం ఎన్.సలోమి, మాజీ ఉపసర్పంచ్ కాకాని వరప్రసాద్, కాకాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాటూరు హైస్కూల్‌లో సోలార్ పవర్ పేనల్ ప్రారంభం

ఉయ్యూరు, జనవరి 26: కాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి ప్రస్తుతం యూఎస్‌లో ఉంటున్న వెల్లంకి వీరభద్రరావు ఆర్థిక సాయం రూ.6లక్షలతో ఏర్పాటుచేసిన 8 కేడబ్ల్యూహెచ్ సోలార్ పవర్ ప్యానల్‌ను సురెడ్డి రాజేంద్రప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు.

మద్యం స్వాధీనం

ఉయ్యూరు, జనవరి 26: ఉయ్యూరులో శుక్రవారం మద్యం విక్రయిస్తున్న ఇద్దరి నుంచి 12 క్వార్టర్ సీసాలు స్వాధీనపరచుకుని వారిని అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ ఎస్సై వాసు తెలిపారు. పట్టణ పరిధిలో మద్యం అమ్మకాలు జరిపేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఉయ్యూరు 10వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న బోడె ప్రసాద్, కానూరులో వెలగపూడి శంకరబాబు తదితరులు

వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

● బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీలో బోడె ప్రసాద్

ఉయ్యూరు, జనవరి 26: వైసీపీ అరాచక, అవినీతి, అసమర్థ పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు నగరపంచాయతీ పరిధి 10, 12 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించి టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ నాయకుల అవినీతిని ప్రజలు గమనిస్తున్నారని తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. టీడీపీ నేతలు గుర్నాధరావు, జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, పలియాల శ్రీనివాసరావు, రమేశ్, బూరెల నరేశ్, వాసు, జయదేవ్, నాగరాజు, భాస్కర్, చిరంజీవి, జనసేన నాయకులు చినకోటయ్య, మహాలక్ష్మి, ఓంకార్ పాల్గొన్నారు.

టీడీపీ సంక్షేమ పథకాలు ఇంటింటికీ ప్రచారం

ఉయ్యూరు: టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక అమలుచేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలు తెలియజేస్తూ టీడీపీ, జనసేన నాయకులు ఆకునూరులో శుక్రవారం పర్యటించి ఇంటింటా ప్రచారం చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోడెప్రసాద్ సతీమణి బోడె హేమ స్థానిక నాయకులతో కలసి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు కాకాని వెంకటేశ్వరరావు, తోట కిరణ్, శ్రీనివాసరావు, కొండా ప్రవీణ్, తుమ్మలపల్లి హరికృష్ణ, నానిపాల్గొన్నారు.

సైకో పాలనకు చరమగీతం పాడుదాం: వెలగపూడి

పెనమలూరు: గద్దెనెక్కిన రోజు నుంచి రాష్ట్ర ప్రజలను రాచి రంపాన పెడుతున్న సైకో జగన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు మూకుమ్మడిగా సాగనంపాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కానూరులో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల ప్రజలూ వైసీపీ ప్రభుత్వంతో ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధిని పూర్తిగా విస్మరించి జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని 30ఏళ్ల వెనక్కి తీసుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానూరు 25, 36, 37బూత్‌ల పరిధిలో టీడీపీ నేతలు మొక్కపాటి శ్రీనివాస్, అంగిరేకుల మురళీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహహించారు.

జోగీ ప్రగల్భాలు మానుకో..

● సత్తా ఉంటే కుప్పంలో పోటీ చెయ్

● మంత్రి జోగి రమేశ్‌కు బోడె ప్రసాద్ సవాల్

ఉయ్యూరు: మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రగల్భాలు మానుకుని ప్రజలకేం చేస్తాడో చెప్పుకోవాలని బోడె ప్రసాద్ అన్నారు. చంద్రబాబుపై పోటీచేసే సత్తా ఉంటే కుప్పంలో పోటీచేయాలని ఆయన సవాల్ విసిరారు. చంద్రబాబుపై పోటీ చేసే సత్తా జోగి రమేశ్‌కు లేదన్నారు. రమేశ్‌పై టీడీపీ, జనసేన కార్యకర్తలను పోటీకి నిలిపినా గెలిపించుకునే దమ్ము తమకుందన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

కంకిపాడు: టీడీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్‌రామ్ అన్నారు. మంతెన గ్రామంలో బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సుదిమళ్ల రవీంద్ర, కొణతం సుబ్రహ్మణ్యం, కాజా బ్రహ్మాజీ, టి. బుజ్జి, సన్ని, జనసేన పార్టీ నాయకులు రామిశెట్టి గోపాలకృష్ణ, కొండపల్లి వనోద్ కుమార్ పాల్గొన్నారు.

అభ్యర్థులు లేక వైసీపీ తంటాలు

కంకిపాడు: రాష్ట్రంలో వైసీపీకి ఎదురుగాలి వీస్తోందని, నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేక నానా తంటాలు పడుతున్నారని అధికారం కోల్పోతున్నామన్న భయం వైసీపీని వెంటాడుతోందని టీడీపీ కంకిపాడు మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర విమర్శించారు. కంకిపాడు మండలం జగన్నాథపురంలో శుక్రవారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, ఉప్పు నారాయణ, నూకల నాగార్జున, జనసేన పార్టీ నాయకుడు మేకల మణికంఠ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

పేద విద్యార్థులకు రేవతిభాను ట్రస్టు చేయూత



మచిలీపట్నం టౌన్ : తండ్రిని కోల్పోయిన విద్యార్థులకు గొర్రెపాటి రేవతి భాను మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ల్యాప్‌ట్యాప్‌లను పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దివంగత జర్నలిస్టు సుంకర కల్యాణ్ కుమారుడు సుంకర జయసూర్య, కుమార్తె సింధూరలకు ల్యాప్‌ట్యాప్‌లను అందజేశారు. గోపీచంద్ కుమారుడు, ప్రవాసాంధ్రుడు సోనికాచంద్ పంపిన ల్యాప్‌ట్యాప్‌లను విద్యార్థులకు అందించారు. సామాజిక కార్యకర్త దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మదినిండా గణతంత్ర స్ఫూర్తి

మచిలీపట్నం టౌన్, జనవరి 26 : గణతంత్ర స్ఫూర్తితో అందరూ జాతీయ భావాలను పెంపొందిం చుకోవాలని జేసీ గీతాంజలి శర్మ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం మచిలీపట్నంలోని కలెక్టరేట్ వద్ద జాతీయ జెండాను ఎగుర వేసి, గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాకోర్టు ఆవరణలో జాతీయజెండాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద జాతీయ జెండాను కేడీసీసీబీ ఛైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ఆవిష్కరించారు. కేడీసీసీబీ సీఈవో ఎం శ్యామ్ మనోహర్, జీఎం బీఎల్ చంద్రశేఖర్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కృష్ణాయూనివర్సిటీలో వీసీ జి.జ్ఞానమణి జాతీయ జెండాను ఆవిష్కరించి ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. రిజిస్ట్రార్ బ్రహ్మాచారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పద్మావతి హిందూ జూనియర్ కళాశాల, ఏజె కళాశాల, నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాలు ఎగురవేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం, కోనేరుసెంటర్‌లో కమిషనర్ చంద్రయ్య, టీడీపీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి కొల్లు రవీంద్ర జాతీయ జెండా ఎగురవేశారు. **పెడన** : పట్టణంలోని కళాంజలి హైస్కూల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఈవో- 2 వై.వి. హరనాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అబాకస్ పోటీ ల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ కె. దిలీప్‌కుమార్, కరస్పాండెంట్ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి, తహసీల్దార్ మధుసూధనరావు, ఎస్సై రవిచంద్రకుమార్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. **బంటుమిల్లి** : పెడన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్ తన కార్యాలయం వద్ద పతాకాన్ని ఆవిష్కరించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో స్వర్ణభారతి, ఎంపీపీ వెలివెల చినబాబు, ఎస్సై పైడిబాబు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కొమ్మారెడ్డి విద్యాసంస్థలు, వాగ్దేవి విద్యాసంస్థల్లో గణంతంత్ర దిన వేడుకలు జరిగాయి. **గుడివాడ** : ఆర్డీవో పి.పద్మావతి, డీఎస్పీ పి.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, విద్యా వికాస్ డైరెక్టర్ ఎం.సుబ్బారావు, ది గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ) తదితరులు తమ తమ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. **గుడివాడ రూరల్** : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గద్దె పుష్పరాణి జాతీయ జెండా ఎగురవేశారు. ఈవోపిఆర్‌డి డి.వెంకటేశ్వరరావు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీరాజ్ ఏఈ రామ్మోహనరావు, అధికారులు పాల్గొన్నారు. మార్కెట్ యార్డులో ఛైర్‌పర్సన్ మట్టా నాగమణి జాతీయ జెండా ఎగురవేశారు. కార్యదర్శి భాస్కరరావు, మట్టా జాన్ విక్టర్, దొండపాడు మాజీ సర్పంచ్ గద్దె రామాంజనేయులు, అధికారులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు** : ఎంపీడీవో దారపు శ్రీనివాస్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ హైస్కూల్‌ల్లో జాతీయ జెండాను స్వామి స్థైర్యానంద సరస్వతి ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరులో అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు జాతీయ జెండా ఆవిష్కరించారు. **పామర్రు** : పామర్రులో గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తన కార్యాలయం వద్ద, టీడీపీ కార్యాలయం వద్ద వర్ల కుమార్‌రాజా, జనసేన పార్టీ కార్యాలయం వద్ద తాడిశెట్టి నరేష్ పతాకాలను ఆవిష్కరించారు. ఉన్నతాధికారులు తమ తమ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. **చల్లపల్లి** : ఎంపీడీవో సిహెచ్.చినరాట్నాలు జాతీయపతాకాన్ని ఎగురవేయగా, ఎంపీపీ కోట విజయ రాధిక, ఎంపీటీసీలు మాలెంపాటి శ్రీనివాసరావు, పైడిపాముల స్వప్న, రాజులపాటి అంకమ్మ, ఏఈ బొప్పన శ్రీనివాసరావు పాల్గొన్నారు. సీఐ సిహెచ్.నాగప్రసాద్, ఎస్సై సిహెచ్.చిన్నబాబు, తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఘంటసాల కృష్ణమోహన్, పంచాయతీలో కార్యదర్శి పి.వి. మాధవేంద్రరావు జాతీయ పతాకాలను ఎగురవేశారు. బస్టాండ్ సెంటరులో స్వాతంత్ర్య సమరయోధులు తోట నరసయ్యనాయుడి శిలాఫలకం వద్ద గణతంత్ర దినోత్సవం జరిగింది. **అవనిగడ్డ** : గాంధీక్షేత్రంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, వైసీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. డిఎస్పీ మురళీధర్, ఎంపీడీవో మరియదేవి, తహసీల్దార్ శివరామకృష్ణ జాతీయ జెండాను ఎగురవేశారు. గాంధీక్షేత్రంలో విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు, సమరయోధుల వేషధారణ పోటీలు నిర్వహించారు. **అవనిగడ్డ రూరల్** : పులిగడ్డ గురుకుల విద్యాలయంలో తహసీల్దార్ శివరామకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్, వ్యాయామోపాధ్యాయులు గుంటూరు వీరకుమార్ పాల్గొన్నారు. బందలాయి చెరువు వద్ద దివ్యాంగుడు గాజుల రాముడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆలయ నిర్వాహకురాలు సింహాద్రి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. పులిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ తుంగల సుమతిదేవి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక** : నాగాయలంకలో మండవ బాబురావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. లకనం నాగాంజనేయులు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, ఉప్పల లీలా కృష్ణప్రసాద్, గడ్డిపాటి హమర్ చంద్, కర్రి కృష్ణమూర్తి, టి.శివరామకృష్ణ, ఎస్.విజయ్ భాస్కర్, ఉప్పల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **కోడూరు** : కోడూరులో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు పెద్ది భాస్కరరావు, మాచర్ల భీమయ్య, బడే వీరబాబు, బడే గాంధీ, మర్రే గంగయ్య, కాగిత రామారావు, పాలడుగు ఆనందరావు, పరిశె నాగమల్లేశ్వరరావు, కోట రాంబాబు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీడీవో ఆర్.శ్రీనివాస్, తహసీల్దార్ ఎస్.కె.లతీఫ్ పాషా, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **ఘంటసాల** : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో టి.అనూహ్య జాతీయ జెండా ఎగురవేయగా, ఎంపీపీ వేమూరి రజనికుమారి, వేమూరి ప్రవీణ్ పాల్గొన్నారు. తహసీల్దార్ బి.రామానాయక్ జాతీయ జెండాను ఎగురవేయగా, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఉద్యోగులు పాల్గొన్నారు. పంచాయతీల సర్పంచ్ లు, కార్యదర్శులు, పాలక వర్గసభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. కొడాలిలో టీడీపీ నాయకులు వీరంకి నాగరాజు ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేసి విద్యార్థులకు మిఠాయిలు పంచారు. **తోట్లవల్లూరు** : తహసీల్దార్ ఎం కుసుమకుమారి, ఎంపీడీవో స్వర్ణలత, పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి వీరరాజు(హెచ్‌సీ) జాతీయ పతాకాలను ఎగురవేశారు. గ్రామపంచాయితీ కార్యాలయాల వద్ద కార్యదర్శులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీ య జెండాలను ఎగురవేశారు. మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సంయుక్తంగా గణతంత్ర వేడుకలు నిర్వహించాయి. వాసవీ క్లబ్ అధ్యక్షుడు తమ్మన ఉమా మహేశ్వరరావు, మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త శేష శ్రీనివాసరావు సభ్యులు పాల్గొన్నారు. **కూచిపూడి** : గణతంత్ర దిన వేడుకలు మొవ్వ మండలంలో ఘనంగా నిర్వహించారు. మొవ్వ కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తి రాజన్ ఉదయ్ ప్రకాష్, తహసీల్దార్ సిహెచ్.వీరాంజనేయ ప్రసా ద్, ఎస్సై సందీప్, ఎంపీడీవో సుధాప్రవీణ్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మొవ్వ పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ వేదరాజ్, కూచిపూడి కళాపీఠంలో ప్రిన్సిపాల్ రామలింగశాస్త్రి, నాట్య అధ్యాపకులు జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. **పెదపారుపూడి** : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతా మహాలక్ష్మి, తహసీల్దార్ వి.నాగభూషణం తమతమ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాలను ఎగురవేశారు. వెంట్రప్రగడ గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. పెదపారుపూడి, వానపాముల, యలమర్రు తదితర గ్రామాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. **నందివాడ** : తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లలో జాతీయ పతాకాలు ఎగురవేశారు. తుమ్మలపల్లి, నరసింహాపురం, పుట్టగుంట, కుదరవల్లి, పొలుకొండ, తమిరిశ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండాలు ఎగురవేసి గౌరవ వందనం చేశారు. తుమ్మలపల్లిలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ భగవన్నారాయణ, ఎంపీపీ ఆదాం, సతీష్, రాధాకృష్ణ, ము రళీ పాల్గొన్నారు. **మోపిదేవి** : ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, తహసీల్దార్ నవీన్ కుమార్ జాతీయ పతాకాలను ఎగురవేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో పూషడపు రత్నగోపాల్ పతాకాన్ని ఎగురవేయగా, చిలకలపూడి పాపారావు, మాదివాడ వెంకట కృష్ణ, రాయపూడి వేణుగోపాలరావు పాల్గొన్నారు. బీసీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలల వద్ద ప్రిన్సిపాల్ కె.వీరరవి జాతీయ పతాకాన్ని ఎగురవేసి గణతంత్ర దినోత్సవ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు.



జాతీయ పతాకాలను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తున్న జేసీ గీతాంజలి శర్మ, జిల్లా న్యాయాధికారి అరుణ సారిక, కృష్ణా వర్సిటీ వీసీ జ్ఞానమణి, గుడివాడ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ



అవార్డు అందుకుంటున్న సీఐ ఇంద్రశ్రీనివాస్, ఎస్సై సుబ్రహ్మణ్య, ఈవోపీఆర్డీ సీతారామరాజు, డాక్టర్ వేణు, తహసీల్దార్ కుసుమకుమారి

ఉత్తమ సేవకులకు అవార్డులు

గుడివాడ : గుడివాడ వన్‌టౌన్ సీఐ కె.ఇంద్రశ్రీనివాస్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్.పిజాషువా చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్నారు. సీఐతో పాటు వన్‌టౌన్ ఎస్సై గౌతమ్, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ రామ్మోహనరావు ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు. **నాగాయలంక** : నాగాయలంక ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ జాషువా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. **కూచిపూడి** : మొవ్వ మండల పంచాయతీ విస్తరణాధికారి వీర్ల సీతారామరాజుకు గణతంత్ర దినోత్సవ అవా ర్డు లభించింది. కలెక్టర్ పి.రాజాబాబు చేతులమీదుగా శుక్రవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో అవార్డు అందుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సీతారామరాజుకు అభినందనలు తెలిపారు. **గుడివాడ రూరల్** : ఉత్తమ పశువైద్యాధికారిగా టి.వేణు శుక్రవారం బందరులో కలెక్టర్ చేతుల అవార్డు అందుకున్నారు. ఎంపీపీ గద్దె పుష్పరాణి, జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ తదితరులు అభినందించారు. **తోట్లవల్లూరు** : తోట్లవల్లూరు తహసీల్ధార్ ఎం. కుసుమకుమారి శుక్రవారం కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా ఉత్తమ అధికారిణి అవార్డు అందుకున్నారు.

స్వతంత్రపురం జడ్పీ విద్యార్థి శ్రీనివాసరావు..



కోడూరు : స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాల పదవ తరగతి విద్యార్థి ఈర్ల శ్రీనివాసరావుకు గణతంత్ర దినోత్సవ పురస్కారం లభించింది. కలెక్టర్ పి.రాజాబాబు అవార్డును శ్రీనివాసరావుకు అందజేశారు. శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

గొర్రెపాటి ట్రస్టు సేవలు అభినందనీయం



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న కుటుంబరావు, ఎన్ఆర్ఐ రంగనాథబాబు

చల్లపల్లి : గొర్రెపాటి వెంకట్రాయులు, ఉదయ భాస్కరమ్మ విద్యాట్రస్ట్ పేద విద్యార్థులకు చేయూతనందివ్వడం అభినందనీయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు చెరుకూరి కుటుంబరావు అన్నారు. విజయా అకాడమీలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గొర్రెపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో 126 మంది విద్యార్థులకు రూ.7.73 లక్షల స్కాలర్‌షిప్‌లను ట్రస్ట్ అధ్యక్షులు, ప్రవాస భారతీయులు గొర్రెపాటి రంగనాథబాబుతో కలిసి అందజేశారు. తొలుత జాతీయపతాకాన్ని రంగనాథబాబు ఎగురవేశారు. మాజీ ఎంపీపీ యార్లగడ్డ లంకబాబు, స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, సర్పంచ్ కృష్ణకుమారి, జడ్పీ మాజీ వైస్‌ఛైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని సాగనంపే సమయం ఆసన్నం



మందపాడులో బాబు ష్యూరిటీలో వెనిగండ్ల రాము

అవనిగడ్డ మూడో వార్డులో బాబు ష్యూరిటీ కరపత్రాలు అందజేస్తున్న మండలి వెంకట్రామ్

గుడివాడ, జనవరి 26 : సీఎం జగన్‌రెడ్డిని సాగనంపే సమయం ఆసన్నమైందనినియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. మందపాడు 21వ వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ, ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ము న్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్లు రేమల్లి మరియకుమారి, శొంఠి రామకృష్ణ, పొట్లూరి కృష్ణారావు, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్కారరావు, స్థానిక నాయకులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, పోలాని ఉమామహేశ్వరరావు, కొడాలి రామరాజు, గోర్జి సత్యనారాయణ, ఎస్.దేవేంద్రుడు, మాతంగి భాగ్యరాజు, చుక్కా వెంకటేశ్వరరావు, కోలవెన్ను గోపాలకృష్ణ, కూనపరెడ్డి దామోదరరావు, కృష్ణార్జున రావు, దాసి మోహనరవీంద్ర, మాకుల నాని, పాల్గొన్నారు. **అవనిగడ్డ** : రాష్ట్ర భవిష్యత్ బాగుపడాలంటే చంద్రబాబు రావాల్సిందేనని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ తెలిపారు. అవనిగడ్డ మూడో వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వమించారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కోడూరు** : ప్రజలపై భారాలలను మోపుతున్న ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, రాసంశెట్టి నాగరాజు, బొలిశెట్టి విఠల్‌రావు, గోగినేని సోమేశ్వరరావు, పిల్లి మల్లిఖార్జునరావు, మేడా శివాజీ, దావు మల్లి, మహమ్మద్ ఇమ్రాన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉమ్మడి మేనిఫెస్టో ప్రజలకు వివరించాలి : కాగిత



బంటుమిల్లి : టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతికార్యకర్తకు ఉందని కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్లస్టర్, బూత్ కన్వీనర్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యాక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ట్రైనర్ వెంకట్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలను గమనించాలన్నారు. కూనపరెడ్డి వీరబాబు, బొర్రా కాశీ, ఇల్లూరి లీలాకృష్ణ, అంగర రంగనాథ్ ఎండి అక్బర్, ఆకునూరి రత్నం, జొన్నలగడ్డ కొండ, సూరిబాబు, ధనశ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఓటమి భయం : కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జనవరి 26 : సీఎం జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. తన కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో తిరోగమనంలో ఉందన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టే రోజు లు వచ్చాయన్నారు. రూ.4 లక్షల కోట్ల వరకు ప్రజా వనరులను వైసీపీ మంత్రులు దోచుకున్నారన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు.



అవనిగడ్డలో కేక్ కట్ చేస్తున్న చిరంజీవి అభిమానులు

యాకమూరులో జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో సంబరాలు

చిరంజీవికి పద్మవిభూషణ్‌పై అభిమానుల ఆనందహేల

అవనిగడ్డ, జనవరి 26 : సినీ నటులు చిరంజీవికి పద్మవిభూషణ్ ప్రకటించటం పట్ల చిరు అభిమానులు శుక్రవారం అవనిగడ్డలో సంబరాలు నిర్వహించారు. అవనిగడ్డ వంతెన సెంటర్‌లో అఖిల భారత చిరంజీవి అభిమాన సంఘాల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అభిమానులకు మిఠాయిలు పంపిణీ చేశారు. చిరంజీవి అభిమాన సంఘ నేత అప్పికట్ల తారక మస్తాన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, ఉమ్మడి జనసేన పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, బచ్చు వెంకటనాథ్, చెన్నగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొనగా, చిరంజీవి అభిమాన సంఘ నేత తారక మస్తాన్‌ను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. **తోట్లవల్లూరు** : సినీ నటుడు చిరంజీవికి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డు ప్రకటించిన సందర్భంగా శుక్రవారం యాకమూరులో జనసేన, టీడీపీ నాయకులు కేక్ కట్‌చేసి హర్షం వ్యక్తం చేశారు. పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా కేక్ కట్ చేశారు. చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు రావటం తెలుగు ప్రజలందరికి గర్వకారణమన్నారు. మండల జనసేన అధ్యక్షుడు ఎస్ కృష్ణసుమన్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు సీహెచ్ సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ ఎస్ మార్కండేయులు, మేడిశెట్టి మస్తాన్, గరికపాటి భవాని, బొమ్మారెడ్డి కిరణ్‌కుమార్, బాల నాగేశ్వరరావు అంబటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు నగదు బహుమతి



తోట్లవల్లూరు : పెనమకూరు జడ్పీ హైస్కూల్లో 2022-23 సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించి సయ్యద్ సమీర్, ద్వితీయ స్థానం సాధించిన మేడ అంజలి, తృతీయ స్థానం సాధించిన ఇంటూరి హనీష్‌కి శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత యువజన సంఘం ఆధ్వర్యంలో తెల్లాకుల శ్రీనివాస్ నగదు పురస్కారాలను అందించారు. సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు మరీదు వెంకట శివ మధుబాబు, మాజీ సర్పంచ్ మరీదు నాగేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఓంకారేశ్వరి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెడన జెడ్పీ విద్యార్థులు రూ.50 వేల డిపాజిట్

పెడన : భట్ల జ్ఞాన కోటయ్య జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు కృష్ణా కో ఆపరేటివ్ బ్యాంకులో రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండును శుక్రవారం ప్రస్తుత హైస్కూల్ హెచ్‌ఎం ఎన్.ఉషకు అందజేశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వచ్చే వడ్డీతో ప్రతి ఏటా రిపబ్లిక్ డే రోజున పదవ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు బహుమతులు ఇవ్వాలని పూర్వ హెచ్‌ఎంకు సూచించారు. పూర్వ విద్యార్థులు మెట్ల గోపీప్రసాద్, ఇర్ఫాన్ బాషా, ప్రభాకర్, తిరుమలరావు, రంగారావు, మోహనరావు, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి జడ్పీ వజ్రోత్సవాలకు తీర్మానం

మోపిదేవి : మోపిదేవి జిల్లా పరిషత్ పాఠశాల వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు తీర్మానించారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం సన్నాహక సమావేశం జరిపి, వజ్రోత్సవ ఏర్పాట్లపై చర్చించారు.

కేడీసీసీబీ భవనానికి శంకుస్థాపన

చల్లపల్లి : చల్లపల్లిలో కేడీసీసీ బ్యాంకు భవన నిర్మాణానికి ఛైర్‌పర్సన్ తాతినేని పద్మావతి శంకుస్థాపన చేశారు. రైతులకు కేడీసీసీబీ విస్తృత సేవలందిస్తోందన్నారు. సీఈవో ఎ.శ్యాం మనోహర్, ఏజీఎం జి.సూర్యప్రకాశరావు, చల్లపల్లి కేడీసీసీ బ్యాంకు మేనేజర్ యలవర్తి నగరాజకుమారి, డైరెక్టర్ పడమటి సుజాత, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సొసైటీల ఛైర్‌పర్సన్‌లు, సీఈవోలు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం రేపు

చల్లపల్లి : ఈనెల 28వ తేదీన చల్లపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు మాదివాడ వెంకటకృష్ణ(క్రిస్టియన్) తెలిపారు. చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎకో, 2డీ తదితర గుండె పరీక్షలు, నేత్ర పరీక్షలు, షుగరు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. జనసేన జిల్లా నేత రాయపూడి వేణుగోపాల్, చోడగం విమల్‌కృష్ణ, ఉస్మాన్ షరీఫ్, పూషడపు రత్నగోపాల్, జివి.తాతారావు, పసుపులేటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ : పెద ఎరుకపాడు, బేతవోలు, వాంబే కాలనీ, ఇందిరానగర్‌కాలనీ, ధనియాలపేట, నీలామహల్ సెంటర్, బైపాస్ రోడ్డు, టీచర్స్ కాలనీలు శనివారం ఉద యం 8 గంటల నుండి 12.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సెంట్రింగ్ కూలి ముగ్గురికి తీవ్ర గాయాలు

కృత్తివెన్ను : చినపాండ్రాక ఓఎన్‌జీసీ సైట్‌లో భవనం సెంట్రింగ్ కూలి ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. సెంట్రింగ్ పనులు చేస్తుండగా కుప్పకూలింది. ఈ ఘటనలో చినపాండ్రాకకు చెందిన పెద్ది సుబ్రహ్మణ్యం, మర్రివాడ నగేష్, పులి గంగరాజులకు తీవ్రగాయాలు అయ్యాయి. వారిని మచిలీపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.